RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA
TELUGU DAILY
నిజం మా విజన్
18వ వసంతంలోకి

EDITOR :Boorla Venkatesham KARIMNAGAR VOLUME:18 ISSUE:27 FRIDAY ,MAY 29,2026 PAGES:20 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :27 శుక్రవారం, మే 29, 2026, పేజీలు -20 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి...
## కార్యక్రమానికి హాజరైన నందమూరి కుటుంబ సభ్యులు

- అమీర్‌పేట మైత్రివనం వద్ద విగ్రహావిష్కరణ
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, నందమూరి కుటుంబ సభ్యులు, మంచు మనోజ్
- కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిందే ఎన్టీఆర్ అన్న రేవంత్ రెడ్డి
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల హామీని నెరవేరుస్తున్న సీఎం



తెలంగాణ పత్రిక ప్రతినిధి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని అమీర్‌పేట మైత్రివనం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, నందమూరి కుటుంబ సభ్యులు, నటుడు మంచు మనోజ్, దర్శకుడు బోయపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. - మిగతా2లో

## మధిర నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం


2

- కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు శ్రీకారం..
- గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్, మౌళిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది..
- ఎస్సీ కాలనీల్లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయింపు..

## కర్ణాటక సర్కార్‌లో కీలక పరిణామం...
## సీఎం కుర్చీ దిగిన సిద్ధరామయ్య..

తెలంగాణ పత్రిక ప్రతినిధి

కర్ణాటక రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేశారు. గురువారం మధ్యాహ్నం ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి ఆయన లోక్‌భవన్‌కు వెళ్లి.. తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. అయితే ఆ సమయంలో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ అందుబాటులో లేకపోవడంతో.. - మిగతా2లో



## హోర్ముజ్‌లో మందుపాతరల వేట..
## ప్రత్యేక నౌకను పంపిన బ్రిటన్..

తెలంగాణ పత్రిక ప్రతినిధి

ఇరాన్ యుద్ధంలో తాము ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడానికి ఇష్టపడటం లేదని చెబుతున్న బ్రిటన్, హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా మార్చేందుకు మాత్రం సిద్ధమవుతోంది.హోర్ముజ్ జలసంధి లోని ఇరాన్ అమర్చిన మందుపాతరలను గుర్తించి, తొలగించడంలో సహాయపడటానికి ముందుకొచ్చింది. హోర్ముజ్ జలసంధికి ఒక ప్రత్యేక సైనిక నౌకను పంపింది. బ్రిటన్ - మిగతా2లో



## బీజేపీలో కీలక మార్పులు..
### నాలుగు రాష్ట్రాలకు కొత్త అధ్యక్షులు



తెలంగాణ పత్రిక ప్రతినిధి

భారతీయ జనతా పార్టీ అధిష్ఠానం పలు రాష్ట్రాల్లో పార్టీ నాయకత్వంలో కీలక మార్పులు చేసింది. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, త్రిపుర రాష్ట్రాలకు కొత్త పార్టీ అధ్యక్షులను నియమిస్తూ నేడు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని బీజేపీ జాతీయ కార్యదర్శి - మిగతా2లో

## మహాలక్ష్మికి స్మార్ట్ కార్డులు..




తెలంగాణ పత్రిక ప్రతినిధి

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడానికి, దుర్వినియోగాన్ని అరికట్టడానికి ప్రభుత్వ ప్రత్యేకంగా మహాలక్ష్మి స్మార్ట్ కార్డుల జారీ చేయనున్నది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఆర్టీసీలో విద్యార్థులకు రాయితీ, ఉద్యోగులకు, ఇతరులకు నెలవారీగా సీజన్ పాస్ అమల్లో ఉన్న సంగతి తెలిసిందే. ఇదే తరహాలో మహాలక్ష్మిలకు స్మార్ట్ కార్డులు ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించింది. - మిగతా2లో

## ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమే: మంత్రి కోమటి రెడ్డి



తెలంగాణ పత్రిక ప్రతినిధి

బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అల్లా పట్ల ఉన్న అపారమైన విశ్వాసాన్ని, త్యాగనిరతిని చాటిచెప్పే గొప్ప పండుగ ఇదని వ్యాఖ్యానించారు. నల్గొండ పట్టణంలోని మునుగోడు రోడ్డు ఈద్గాలో ముస్లిం సోదరులను కలిసి - మిగతా2లో

## సింగరేణి, ఆర్టీసీ కార్మికులను ఈ ప్రభుత్వం ఘోరంగా మోసం చేస్తోంది

తెలంగాణ పత్రిక ప్రతినిధి


తెలంగాణ వర్గాల గతి మార్చే అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని అది తెలంగాణలో విప్లవాత్మక మార్పులు తెస్తుందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కు చెందిన సీనియర్ నాయకులు, మాజీ మంత్రి బోడ జనార్ధన్ తో పాటు ఆయన అనుచరులు టీఆర్ఎస్‌లో చేరారు. - మిగతా2లో



## హైదరాబాద్ టెక్కీ ఇంట్లో దొంగతనం..
## ఫిర్యాదు చేసిన టెక్కీపైనే సొసైటీ పెద్దల ఫైర్!

తెలంగాణ పత్రిక ప్రతినిధి

హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ హౌసింగ్ సొసైటీలో ఓ టెక్కీకి విచిత్రమైన అనుభవం ఎదురైంది. తన ఇంట్లో దొంగతనం జరిగిందని ఫిర్యాదు చేస్తే, దానికి పరిష్కారం చూపాల్సింది పోయి, తనపైనే సొసైటీ నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే, - మిగతా2లో



### ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి... కార్యక్రమానికి హాజరైన నందమూరి కుటుంబ సభ్యులు

-మొదటిపేజీ తరువాయి

రామారావు పేరు పెట్టుకున్న నకిలీలు కూడా కూడా ఈరోజు నాయకుడిగా చెలామణి అవుతున్నారని వ్యాఖ్యానించారు.ఎన్టీఆర్ అవకాశమిచ్చి, ప్రోత్సాహమిచ్చిన వారిలో తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు, మాధవరెడ్డి, జానారెడ్డి, దేవేందర్ గౌడ్, కడియం శ్రీహరి, మోత్కుపల్లి నర్సింహులుతో పాటు కేసీఆర్ కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఆయనకు రాజకీయ అవకాశం కల్పించిందే ఎన్టీఆర్ అన్నారు. ఈ చరిత్రను ఎవరూ మరువరాదని రేవంత్ రెడ్డి అన్నారు..

## హోర్ముజ్‌లో మందుపాతరల వేట.. ప్రత్యేక నౌకను పంపిన బ్రిటన్..

-మొదటిపేజీ తరువాయి

రాయల్ నేవీకి చెందిన ఆర్ఎఫ్ఏ లైమ్ బే నౌక సహాయంతో హోర్ముజ్‌లోని సీ-మైన్స్‌ను తొలగించే ఆపరేషన్ మొదలుకాబోతోంది. ఈ నౌకను మైన్-హంటింగ్ డ్రోన్లు, అండర్‌వాటర్ సెన్సర్లు, క్లియరెన్స్ బృందాలతో అప్‌గ్రేడ్ చేసి హోర్ముజ్ వైపు పంపించారు. ఈ నౌక ప్రస్తుతం జిబ్రాల్టర్ నుంచి బయలుదేరి సూయజ్ కాలువ ద్వారా పర్షియన్ గల్ఫ్ వైపు ప్రయాణిస్తోంది. సోనార్, ధ్వని, అయస్కాంత సెన్సార్లను ఉపయోగించి మందుపాతరలను గుర్తించే సామర్థ్యం గల వ్యవస్థలను ఈ నౌక మోసుకెళ్తోంది. ఇరాన్ నుంచి దాడులను ఎదుర్కొంటున్న పశ్చిమాసియా దేశాలకు బ్రిటన్ ఇప్పటికే యుద్ధ విమానాలను, డ్రోన్ నిరోధక వ్యవస్థలను అందించింది. కాగా, వాషింగ్టన్, టెహ్రాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిన తర్వాత, వాణిజ్య నౌకలను రక్షించడం, హోర్ముజ్ జలసంధి నుంచి పేలుడు పదార్థాలను తొలగించడం లక్ష్యంగా ఒక పూర్తి రక్షణాత్మక కార్యక్రమానికి తాము సంయుక్తంగా నాయకత్వం వహిస్తామని యూకే, ఫ్రాన్స్ ఏప్రిల్‌లో ప్రకటించాయి.

### బీజేపీలో కీలక మార్పులు.. నాలుగు రాష్ట్రాలకు కొత్త అధ్యక్షులు

-మొదటిపేజీ తరువాయి

అరుణ్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. తాజా మార్పుల ప్రకారం కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలు, రోడ్డు రవాణా శాఖ సహాయ మంత్రిగా ఉన్న హర్ష్ మల్హోత్రాకు ఢిల్లీ బీజేపీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. వీరేంద్ర సచ్‌దేవా స్థానంలో ఆయన ఈ పదవిని చేపట్టనున్నారు. హర్యానా బీజేపీ నూతన అధ్యక్షురాలిగా డాక్టర్ అర్చనా గుప్తాను, పంజాబ్ రాష్ట్ర అధ్యక్షుడిగా సర్దార్ కేవల్ సింగ్ ధిల్లాన్‌ను, త్రిపుర సారథిగా డాక్టర్ అభిషేక్ దేబ్రాయ్‌ను నియమించారు. నితిన్ నబిన్ బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీలో జరిగిన తొలి పెద్ద పునర్వ్యవస్థీకరణ ఇదే కావడం గమనార్హం. ఈ నియామకాల్లో పంజాబ్ అధ్యక్షుడి ఎంపికకు రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. వచ్చే ఏడాది పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ మార్పు కీలకంగా మారింది. ప్రస్తుతం ఆప్ పాలనలో ఉన్న పంజాబ్‌లో కాంగ్రెస్ నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ రాజకీయ అవకాశాన్ని అందిపుచ్చుకుని కీలక శక్తిగా ఎదగాలని బీజేపీ భావిస్తోంది. వీరి నేతృత్వంలో రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో కొత్త కార్యవర్గాల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది.

### సింగరేణి, ఆర్టీసీ కార్మికులను ఈ ప్రభుత్వం ఘోరంగా మోసం చేస్తోంది

-మొదటిపేజీ తరువాయి

కార్యాలయంలో వారికి కండువాలు కప్పి టీఆర్ఎస్ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రాజకీయాల్లో అపార అనుభవం ఉన్న బోడ జనార్దన్ చేరికతో టీఆర్ఎస్ కు మరింత బలం చేకూరిందన్నారు. చిన్న వయసులోనే కార్మిక శాఖ మంత్రిగా, ఆర్టీసీ ఛైర్మన్ గా పనిచేసిన జనార్ధన్ సింగరేణి కార్మికులు, ఆర్టీసీ కార్మికుల కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఆయన హోదాకు తగిన విధంగా పార్టీలో ప్రాధాన్యం ఇస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగరేణి, ఆర్టీసీ కార్మికులకు అన్యాయం చేస్తూ కర్కషంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాజకీయాల్లో కొత్త ఒరవడి సృష్టించేందుకు ఏర్పడిందే తెలంగాణ రక్షణ సేన అని కవిత అన్నారు. సబ్బండ తెలంగాణ వర్గాల గతి మార్చే అభివృద్ధి ప్రణాళికను తయారు చేస్తున్నామని త్వరలోనే ఆ ప్రణాళికను ప్రకటిస్తామని చెప్పారు. ఇందుకోసం చాలా సీరియస్‌గా కసరత్తు చేస్తున్నామన్నారు. తాము తీసుకురాబోయే ప్రణాళిక తెలంగాణ లో విప్లవాత్మక మార్పులు తెస్తుందని కవిత చెప్పారు. తమ పార్టీ సమ సమాజ స్థాపన కోసం ఏర్పడిందని తాము కచ్చితంగా తెలంగాణ ప్రజల ఇంటి పార్టీగా మారుతామన్నారు. ప్రశ్నించటం, పోరాటడటం, పరిష్కరిం చటం అనే విధానంతో తాము ముందుకు వెళ్తున్నామని కవిత చెప్పారు. కొంతమంది ప్రశ్నిస్తారు. మరికొంతమంది పోరాటం చేస్తారు. కానీ తమ పార్టీ ప్రశ్నించి, పోరాడి, పరిష్కరించే వరకు సమస్యను వదిలిపెట్టదన్నారు. జనం బాట కార్యక్రమం లో మనం ప్రస్తావించిన సమస్యల్లో 25 సమస్యలకు పరిష్కారం లభించిదని గుర్తు చేశారు.. నల్గొండలో 35 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న బ్రిడ్జి పనులను జనంబాటలో ప్రస్తావిస్తే...ఇప్పుడు ఆ బ్రిడ్జి పనులను ప్రారంభించారని కవిత గుర్తు చేశారు.

# మధిర నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

మధిర నియోజకవర్గాన్ని రాష్ట్ర స్థాయిలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. గురువారం ఎర్రుపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ లతో కలిసి రహదారులు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఆలయ పునర్నిర్మాణ పనులకు వరుసగా శంకుస్థాపనలు చేశారు. ముందుగా ఎర్రుపాలెం మండలం గోసవీడు గ్రామంలో" 2 కోట్ల 80 లక్షలతో గోసవీడు నుండి రామకృష్ణాపురం వరకునిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, 35 లక్షలతో గోసవీడు ఎస్సీ కాలనీలో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు, 2 కోట్లతో రామన్నపాలెం నుండి కట్లేరు చెరువు వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇనగాలి గ్రామంలో 6 కోట్ల 75 లక్షలతో ఇనగాలి నుండి సైదెల్లిపురం వరకు, 3 కోట్ల 75 లక్షలతో ఇనగాలి నుండి సిద్ధినేని గూడెం వరకు నిర్మించనున్న బిటీ రోడ్డు నిర్మాణ పనులకు, 31 లక్షలతో ఇనగాలి ఎస్సీ కాలనీలో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ములుగుమాడు గ్రామంలో కోటి 29 లక్షలతో చేపట్టిన శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణ పనులకు, ములుగుమాడు నుండి నాగవరప్పాడు వరకు 3 కోట్ల 75 లక్షలతో,ములుగుమాడు నుండి సైదేల్లిపురం వరకు 3 కోట్ల 50 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, ములుగుమాడు ఎస్సీ కాలనీలో 63లక్షలతో చేపట్టిన అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 4 కోట్ల 50 లక్షలతో తక్కెళ్ళపాడు నుండి మధిర ఆర్ అండ్ బి రోడ్డు వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, 69 లక్షలతో తక్కెల పాడు ఎస్సీ కాలనీలో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పెద్ద గోపవరం గ్రామంలో 132/33 కేవీ ఎర్రుపాలెం సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు, జమలాపురం గ్రామంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపనలు చేసారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, నియోజక వర్గంలోని ప్రతి గ్రామానికి అత్యుత్తమ మౌళిక సదుపాయాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. నిధుల కొరత లేకుండా పనులు వేగంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రధాన రహదారులతో పాటు మారుమూల గ్రామాల అనుసంధానానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్, మౌళిక వసతుల కల్పన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. భవిష్యత్తు విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మౌళిక వసతుల కల్పన పనులు చేపట్టడం జరిగిందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద స్వశక్తి మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందనీ, సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో స్థానిక రైతులకు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని తెలిపారు.

## కర్ణాటక సర్కార్‌లో కీలక పరిణామం... సీఎం కుర్చీ దిగిన సిద్ధరామయ్య..

-మొదటిపేజీ తరువాయి

ఆయన కార్యదర్శికి లేఖ అందజేశారు సిద్ధరామయ్య. గవర్నర్ బెంగళూరుకు తిరిగి వచ్చిన తర్వాత రాజీనామాపై అధికారిక నిర్ణయం తీసుకోనున్నట్లు లోక్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. రాజీనామా అనంతరం మీడియాతో మాట్లాడిన సిద్ధరామయ్య.. పార్టీ అధిష్ఠానం సూచనల మేరకే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు, పార్టీ ఐక్యత దృష్ట్యా పదవి నుంచి తప్పుకుంటున్నానని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు అసెంబ్లీలో స్పష్టమైన మెజార్టీ ఉందని.. రాజ్యాంగబద్ధంగా కొత్త ప్రభుత్వం ఏర్పడుతుందని చెప్పారు. ముఖ్యమంత్రిగా తనకు సహకరించిన ప్రజలు, పార్టీ నాయకులు, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, ఎంపీ రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు సిద్ధరామయ్య. తన రాజకీయ జీవితాన్ని గుర్తుచేసుకుంటూ సిద్ధరామయ్య భావోద్వేగానికి లోనయ్యారు. రాజకీయాల్లోకి రావడం యాదృచ్ఛికమని, తమ కుటుంబంలో ఇంతకుముందు ఎవరూ రాజకీయాల్లో లేరని అన్నారు. 2006లో కాంగ్రెస్‌లో చేరిన తర్వాత పార్టీ తనకు ఎన్నో అవకాశాలు కల్పించిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిగా రెండు సార్లు, ప్రతిపక్ష నేతగా రెండు సార్లు పని చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తన ప్రభుత్వ పనితీరుపై మాట్లాడిన సిద్ధరామయ్య... ఎన్నికల హామీల్లో ఎక్కువ భాగం అమలు చేశామని పేర్కొన్నారు. తొలి ఏడాదిలోనే ఐదు గ్యారంటీ పథకాలను ప్రారంభించామని తెలిపారు. ప్రతిపక్షాలు అనేక ఆరోపణలు చేసినప్పటికీ ప్రజల కోసం పని చేయడంలో వెనుకడుగు వేయలేదని స్పష్టం చేశారు. పార్టీ అధిష్ఠానం భవిష్యత్తులో ఏ బాధ్యత అప్పగించినా స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు.

# మహాలక్ష్మికి స్మార్ట్ కార్డులు..

-మొదటిపేజీ తరువాయి

స్మార్ట్ కార్డులు వచ్చే నెల 2వ తేదీ నుంచి అమల్లోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో బడ్జెట్ సన్నాహక సమావేశం లో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎం.డి.నాగిరెడ్డి ఈ విషయమై సమీక్షించారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్టీసీకి నిధుల కేటాయింపు ప్రతిపాదలను ఆర్థిక శాఖ మంత్రికి ఎం.డి. నాగిరెడ్డి వివరించడం తోపాటు స్మార్ట్ కార్డుల జారీకి సంబంధించిన వ్యయం గురించి వివరించారు. ఇందుకు ఆమోదం తెలుపడంతో తొలుత జిల్లాకు ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకొని, సాంకేతిక సమస్యలు పరిష్కరించుకొని జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిపై కసరత్తు జరుగుతోంది. స్మార్ట్ కార్డుకు సంబంధించిన విధివిధానాలు ఆర్టీసీ వరంగల్ రీజియన్ పరిధిలోని అధికారులకు ఇంకా అందలేదు. త్వరలో సమాచారం అందే అవ కాశం ఉన్నట్టు చెబుతున్నారు.

**ఏటీఎం తరహాలో కార్డు**

ఏటీఎం తరహాలో చిప్‌తో కూడిన స్మార్ట్ కార్డు జారీ చేస్తారు. ముందుగా ఆధార్ కార్డు, ఒక ఫొటో సేకరించి మహాలక్ష్ముల ప్రాథమిక సమాచారం చిప్‌తో అనుసంధానిస్తారు. ఈ స్మార్ట్ కార్డులో లబ్ధిదారుడి పూర్తి వివరాలు, ఫొటో, క్యూఆర్ కోడ్ ఉంటాయి. తర్వాత వారి పేర్లతో కార్డు జారీ చేస్తారు. అమల్లోకి వచ్చాక స్మార్ట్‌కార్డు చూపకుంటే ఉచిత ప్రయాణానికి అనుమతివ్వరు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9డిపోల పరిధిలో నెలకు సగటున 1.12కోట్ల మంది, ఏడాదికి 13.33 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేస్తున్నారు.

**దుర్వినియోగానికి చెక్**

ఇతర రాష్ట్రాల వారు నకిలీ ఆధార్ కార్డులతో ఈ పథకాన్ని దుర్వినియోగం చేస్తున్న ఘటనలను అరికట్టేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. బతుకు తెరువు కోసం పొరుగు రాష్ట్రాల నుంచి ఇక్కడికి వలస వచ్చిన వేలాది మహిళా కూలీలు, ప్రైవేటు ఉద్యోగులు, నకిలీ ఆధార్ కార్డుల సాయంతో బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. దీని వల్ల ఆర్టీసీకి పెద్ద మొత్తంలో ఆదాయానికి గండి పడుతోంది. ఈ పథకం అమలులోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. కార్డుల జారీ దరఖాస్తు చేసుకునే విధానం, ఇతర నిబంధనలకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవడానికి, సమీప కార్డుల జారీ కేంద్రాన్ని కనుగొనడానికి టీఆర్ఎస్ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్‌లో పూర్తి సమారాన్ని త్వరలో పొందుపరుస్తారు. కార్డులు అందే వరకు ఆధార్ కార్డు చూపించి మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు.

### ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమే: మంత్రి కోమటిరెడ్డి

-మొదటిపేజీ తరువాయి

బక్రీద్ కేవలం ఒక మతపరమైన వేడుక మాత్రమే కాదని... ఇది మానవాళికి ఒక గొప్ప జీవన సందేశమని పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయాలకు అతీతంగా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 'భారత్ జోడో' యాత్ర చేపట్టారని ప్రస్తావించారు. అన్నివర్గాలు, అన్నిమతాల ప్రజలు సమానమేనని, అందరు కలిసి మెలిసి ఉండాలనే గొప్ప సందేశంతో 'భారత్ జోడో' యాత్ర చేశారని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించడంతో విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అనడానికి ఇది ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. నల్గొండలో మతసామరస్యానికి, గంగా - జమునా - తెహజీబ్‌కు నిలువెత్తు సాక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

### హైదరాబాద్ టెక్కీ ఇంట్లో దొంగతనం.. ఫిర్యాదు చేసిన టెక్కీపైనే సొసైటీ పెద్దల ఫైర్!

-మొదటిపేజీ తరువాయి

దీనిపై ఆయన రెసిడెంట్స్ వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేసి, దర్యాప్తు కోసం సీసీటీవీ ఫుటేజ్ కావాలని కోరారు. అయితే, అప్పుడే ఆసక్తికర విషయం బయటపడింది. సొసైటీలోని సెక్యూరిటీ కెమెరాలు పనిచేయడం లేదని, ఈ విషయం తమకు కూడా ఇప్పుడే తెలిసిందని మేనేజర్ సమాధానమిచ్చారు. దీంతో అప్రమత్తమైన శ్రవణ్, భద్రతా లోపం గురించి నివాసితులను హెచ్చరిస్తూ, రక్షణ కోసం సొంతంగా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గ్రూప్‌లో సూచించారు. ఇది జరిగిన మరుసటి రోజే సొసైటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు అతడిని క్లబ్‌హౌస్‌కు పిలిపించారు. దొంగతనం గురించి చర్చించకుండా, "సొసైటీ పరువు తీస్తున్నావ్, అందరి స్థైర్యాన్ని దెబ్బతీస్తున్నావ్" అంటూ తనపై గట్టిగా అరిచారని శ్రవణ్ ఆరోపించారు. ఈ క్రమంలో ఉపాధ్యక్షుడు, "ఈరోజు ఖరీదైన చెప్పులు పోయాయంటారు, రేపు అండర్‌వేర్ పోయిందంటారు. వాటన్నిటికీ మేం బాధ్యత తీసుకోలేం" అని నిర్లక్ష్యంగా వ్యాఖ్యానించినట్లు శ్రవణ్ తెలిపారు. వారి ప్రవర్తనతో విసిగిపోయిన ఆయన, వాట్సాప్ గ్రూప్ నుంచి బయటకు వచ్చి తన అనుభవాన్ని 'ఎక్స్'లో పంచుకున్నారు. ఈ పోస్ట్ వైరల్ అవ్వడంతో, ముంబై వంటి నగరాల్లోని అనేక మంది తాము కూడా ఇలాంటి ఇబ్బందులనే ఎదుర్కొంటున్నామని కామెంట్లు పెడుతున్నారు.

# బెల్ట్ షాపుల పెరుగుదలతో సామాన్యులపై భారం

-బూర్గంపాడు మండలంలో జోరుగా బెల్ట్ షాపు దందా

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 28

వైన్ షాపుల సిండికేట్ వల్ల అధిక ధరలు కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో పట్టణాలు, గ్రామాలలో వైన్ షాపులు సిండికేట్‌గా మారి బెల్ట్ షాపులను విపరీతంగా పెంచుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారిక ధరల కంటే అధికంగా మద్యం విక్రయించడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో ఒక్కో బాటిల్‌పై రూ.50 నుంచి రూ.200 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బూర్గంపాడు మండలంలో బెల్ట్ షాపులు దందా జోరుగా కొనసాగుతుంది ఏజెన్సీ ప్రాంతం కావడం వలన అమాయక గిరిజనులను బెల్ట్ షాప్ యజమానులు నిలువు దోపిడీ చేస్తున్నారు. రోజంతా కష్టపడిన డబ్బును బెల్ట్ షాపులకి ధారపోయవలసి వస్తుందని గిరిజనులు ఆవేదనస్తుతున్నారు. ఇదేమిటి అని అడిగితే ఎక్సైజ్ అధికారులకు ప్రభుత్వ అధికారులకు పోవాల్సిన ముడుపులు పోతున్నాయని




మమ్మల్ని ఎవరు ఏమి చేయలేరని సిండికేట్ యజమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మద్యం కూడా కల్తీ మద్యం అమ్ముతున్నారని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి బూర్గంపాడు మండలంలో జరుగుతున్న బెల్ట్ షాపు దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనధికార బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల్లో కూడా మద్యం అందుబాటులోకి తీసుకురావడంతో యువత, కూలీలు మద్యం వ్యసనానికి గురవుతున్నారని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. కుటుంబాల ఆదాయం మొత్తం మద్యానికే ఖర్చవడంతో అనేక కుటుంబాలు అప్పుల బారిన పడుతున్నాయి. అధిక ధరలు, అప్పుల ఒత్తిడి, కుటుంబ కలహాల కారణంగా కొంతమంది మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్న ఘటనలు బూర్గంపాడు మండలంలో చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. బెల్ట్ షాపుల నియంత్రణలో అధికారుల నిర్లక్ష్యం ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. సిండికేట్ విధానంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని అక్రమ బెల్ట్ షాపులను వెంటనే మూసివేయాలని, మద్యం విక్రయాలను నియంత్రించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఎన్.టి.ఆర్ విగ్రహాని కి నివాళులర్పించిన.ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణా రావు

పెద్దపల్లి, ప్రతినిధి మే 28 ( తెలంగాణ పత్రిక )

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు, విశ్వవిఖ్యాత,నటసార్వభౌమ స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు 103 వ జయంతిని పురస్కరించుకొని పెద్దపల్లి పట్టణంలోని అయ్యప్ప ఆలయ ఆవరణలో ఉన్న వారి విగ్రహానికి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణారావు పూలమాలు వేసి ఘన నివాళులు అర్పించారు,ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు





# సింగరేణి ఆద్వర్యం లో ఉచిత వైద్య శిబిరం

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 28

గురువారం నాడు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో వి కే సి ఎం ప్రాజెక్టు ప్రభావిత పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా రాంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ వైద్య శిబిరంలో వైద్య నిపుణులు గ్రామ ప్రజలకు రక్తపోటు (బిపి), మధుమేహం (షుగర్) వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచిత మందులు అందజేశారు. అలాగే ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను సద్వినియోగం



చేసుకున్నారు. సింగరేణి సంస్థ ప్రజల ఆరోగ్య సంక్షేమానికి కట్టుబడి ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ లలిత కుమారి మాట్లాడుతూ, గ్రామ ప్రజలు ఆరోగ్యంపై మరింత శ్రద్ధ చూపించి, ఇలాంటి వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. వికే సీఎం ప్రాజెక్టు ఆఫీసర్ నరసింహ రావు మాట్లాడుతూ, ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ లలిత కుమారి వి.కె.సి.ఎం ప్రాజెక్టు ఆఫీసర్ నరసింహ రావు వెల్ఫేర్ ఆఫీసర్ విక్టర్ , ఏఐటీయూసీ నాయకులు ఎం.ఆర్.కే ప్రసాద్ ఐ ఎన్ టి యు సి నాయకులు గోపు కుమార్ ఇతర వైద్య సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బహుజన నాయకులు కురిమెళ్ళ శంకర్ ఆశీర్వదించిన ఓణీల అలంకరణ వేడుక

కొత్తగూడెం, మే 28:( తెలంగాణ పత్రిక)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గణేష్ టెంపుల్ వేధర బస్తీలో నిర్వహించిన తంగళ్ళపల్లి శేఖర్ -- ఆదిలక్ష్మి దంపతుల కుమార్తె మురారి ప్రియ ఓణీల అలంకరణ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం 500/82 జిల్లా అధ్యక్షుడు కడియాల సత్యనారాయణ హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ వేడుకలో జిల్లా గౌరవ అధ్యక్షుడు, బహుజన నాయకులు కురిమెళ్ళ శంకర్



పాల్గొని చిన్నారికి ఆశీస్సులు అందజేశారు. అలాగే జిల్లా నాయకులు కడియాల లాలయ్య, కొత్తగూడెం డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్, చుంచుపల్లి మండల అధ్యక్షుడు కడియాల శ్రీనివాసరావు, కొత్తగూడెం నియోజకవర్గ ఇంచార్జ్ జనగామ వంశీ, వైరా నియోజకవర్గ ఇంచార్జ్ మాదుగుల నాగరాజు, కొత్తగూడెం డివిజన్ సహాయ కార్యదర్శి వల్లోజీ రమేష్, జూలూరుపాడు మండల అధ్యక్షుడు కడియాల శీను, కడియాల సిద్దు, వల్లోజి నాగరాజు, కడియాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు నాయకులు శుభాకాంక్షలు తెలియజేస్తూ చిన్నారి మురారి ప్రియ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## పినరాయ్ విజయన్ నివాసాలపై ఈడీ దాడులకు నిరసనగా దమ్మపేటలో సిఐటియు దిష్టిబొమ్మ దగ్ధం

తెలంగాణ పత్రిక దమ్మపేట మే 28

దమ్మపేట:-కేరళ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడు పినరాయ్ విజయన్ ఆఫీసులు నివాసాలపై ఈడి దాడులకు వ్యతిరేఖంగా సి ఐ టి యు మండలకమిటీ ఆద్వర్యంలో దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన తెలపడం జరిగింది ఈ సందర్భంగా సి ఐ టి యు మండల కన్వీనర్ మురహరి రఘు మాట్లాడుతూ కేరళలో కాంగ్రెస్ అధికారంలోకి అధికారంలోకి వచ్చిన తరువాత సిపిఎం ఆఫీసులమీద దాడులు చేస్తూ బిజెపి తో కుమ్మక్కై 2013 లోనే కోర్టులు కొట్టేసిన కేసుల్లో ఆధారాల కోసమని కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరాయ్ విజయన్ నివాసం లో అతని కుటుంబ సభ్యుల నివాసలపై ఈడిసోదాలు చేయడం సిగ్గుచేటు అని ఇది కేవలం రాజకీయ కక్షతో చేసిన సోదాలు అని సిపిఎం ను సైద్ధాంతికంగా ఎదుర్కోలేక రాజ్యాంగ వ్యవస్థలను ఉపయోగించుకొని బలహీన పర్చే కుట్రలు చేస్తున్నారని ఇంతకంటే దిగజారుడు తనం మరొకటి ఉండదని వారు విమర్శించారు ఇండియా భాగస్వామిగా ఉండి కాంగ్రెస్ మీద దాడులు చేసినప్పుడు ఆ తప్పుడు విధానాన్ని ఎత్తిచూపుతూ



తీవ్రంగా విమర్శించిన చరిత్ర సిపిఎం ది అని కానీ కాంగ్రెస్ సిగ్గులేకుండా బిజెపి తో అంట కాగడం కాంగ్రెస్ దివాలకోరు రాజకీయాలకు పరాకాష్ట అని అన్నారు. ఇదే పద్ధతి అనుసరిస్తే బిజెపి కాంగ్రెస్ రెండు నామరూపాలు లేకుండా పోతాయని వారు హెచ్చరించారు. మోడీ 5 రాష్ట్రాల ఎన్నికల ముగిసిన వెంటనే విడతల వారీగా పెట్రోల్ డీజిల్ రేట్లు పెంచుతూ ప్రజలపై విపరీతమైన భారాలను మోపుతున్నారని అన్నారు. ఇందన ధరలు విపరీతంగా పెరగటం వలన నిత్యవసర వస్తువులపై పెనబారం పడి మార్కెట్లో అన్ని రకాల వస్తువులు ఆకాశాన్ని తాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ నాగు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్.టి.ఆర్ విగ్రహాని కి నివాళులర్పించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

తెలంగాణ పత్రిక దమ్మపేట మే 28



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు, విశ్వవిఖ్యాత,నటసార్వభౌమ స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారి 103 వ జయంతిని పురస్కరించుకొని గండుగులపల్లిలో నందమూరి తారక రామారావు గారి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ,ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వట్టి రమేష్,వేంపాటి చెన్నారావు,దొడ్డ వెంకటేశ్వరరావు, కాసాని నాగప్రసాద్,ఎర్ర వసంతరావు, చీకటి శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగ




ముధోల్:28మే(తెలంగాణ పత్రిక)

మండల కేంద్రమైన ముధోల్ తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో ఈద్గాల వద్ద భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగ వేడు కలను ఘనంగా జరుపుకున్నారు. పండుగాను పురస్కరించుకొని నూతన వస్త్రాలు ధరించి, ఈద్గా, ప్రత్యేక ప్రార్థనలు ముస్లిం సోదరులు జరిపారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. త్యాగనికి ప్రతీక బక్రీద్ పండుగ అని అన్నారు. ధనిక, పేద అన్న తారత మ్యం లేకుండా స్వార్థం, ద్వేషాలకు అతీతంగా ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో ఈ పండుగను జరుపుకుం టున్నట్లు తెలిపారు.ప్రతి ఒక్కరూ దాన గుణం, సేవాగుణం అలవర్చు కోవాలని చెప్పారు. పండుగ సంద ర్భంగా ముస్లిం సోదరులు ఒకరికొక రు శుభాకాంక్షలు తెలుపుకుంటూ, బంధుమిత్రులతో సంతోషంగా గడిపారు.

## ఈద్గా ల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

-బక్రీద్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) మే 28



బక్రీద్ ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ పవిత్ర పర్వదినాన్ని శాంతి, సామరస్య వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా జగిత్యాల,కోరుట్ల లో గల పలు ఈద్గాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా, బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. ప్రార్థనలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. పండుగల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లావ్యాప్తంగా నిరంతర పెట్రోలింగ్ కొనసాగిస్తామని పేర్కొన్నారు.

### ముస్లిం సోదర సోదరిమణులకు బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్ విజయరమణా రావు

పెద్దపల్లి, ప్రతినిధి మే 28 ( తెలంగాణ పత్రిక )



పెద్దపల్లి పట్టణంలోని ఎల్లమ్మ గుండమ్మ చెరువు కట్ట సమీపంలో గల చందపల్లి ఈద్గా వద్ద బక్రీద్ పండుగను పురస్కరించుకొని గురువారం రోజున అలయ్ బలయ్ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పాల్గొని పెద్దపల్లి జిల్లా ముస్లిం సోదర సోదరిమణులకు బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ లు ముస్లిం మత పెద్దలు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



ఇల్లంతకుంట మే 28 తెలంగాణ పత్రిక

ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం, మాజీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు అన్నాడి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దామెర సత్యం మాట్లాడుతూ.. తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ దేశంలోనే బలమైన పార్టీగా నిలిచిందన్నారు. రూ.2కే కిలో బియ్యం, పేదలకు ఇళ్లు, మహిళలకు ఆస్తిలో సగం వాటా వంటి పథకాలతో ఎన్టీఆర్ చరిత్ర సృష్టించారని కొనియాడారు. చంద్రబాబు, లోకేశ్ నాయకత్వంలో పార్టీ మరింత ముందుకు వెళ్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎర్రోజు కిషన్, గజభీంకర్ ఎల్లోజి, కేతిరెడ్డి మల్లారెడ్డి, దొమ్మాటి లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో కంది విత్తనాలు

-శాస్త్రవేత్త ఆకుల దినేష్


ముధోల్: 28మే(తెలంగాణ పత్రిక)



మండల కేంద్రమైన ముధోల్ వ్యవసాయ పరిశోధన స్థానం లో వచ్చే ఖరీఫ్ సీజన్ లో రైతులు సాగు చేసేందుకు కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని శాస్త్రవేత్త ఆకుల దినేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీఆర్జీ -59 అనే రకం కంది విత్తనాలు వేసుకున్నట్లయితే అధిక దిగుబడి వస్తాయని చెప్పారు. వాతావరణం పరిస్థితులకు అనుకూలంగా ఉండి రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఈ కంది విత్తనాలు 165-180 రోజు ల్లో కోతకు రావడం జరుగుతుందని పేర్కొన్నారు.ఎకరానికి 6-8 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. ఎండు తెగులు, స్టేరిలిటి, మొజాయి క్ వ్యాధిని మధ్యస్థంగా తట్టుకునే గుణం ఉందన్నారు. 4 కిలోల బస్తా రూ.800 ఉంటుందన్నారు. కావాల్సిన రైతులు వ్యవసాయ పరిశోధన స్థానం కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

## చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ వ్యక్తి మృతి...

పాపన్నపేట, మే 28: (తెలంగాణ పత్రిక)





చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీట మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నాగ్సాన్ పల్లి శివారులోని చెలిమకుంటలో గురువారం చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు... నాగ్సాన్ పల్లి గ్రామానికి చెందిన గుండు కిష్టయ్య(48) వ్యవసాయంతో పాటు చేపలు పడుతూ జీవితం గడుపుతున్నాడు.కాగా మంగళవారం సాయంత్రం చేపలు పట్టేందుకు వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లి గ్రామ శివారులో చెలిమ కుంట చెరువులో చేపలు పడుతుండగా కాళ్లకు వల చుట్టుకోవడంతో ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందాడు.తిరిగి ఇంటికి రాలేదు.దీంతో కుటుంబీకులు చుట్టూ పక్కల వెతికారు.గురువారం ఉదయం నాగ్సాన్ పల్లి గ్రామ శివారులోని చెలిమకుంటలో అటుగా వెళ్లిన స్థానికులు నీటిలో మృతదేహాన్ని గమనించి పోలీసులకు, కుటుంబ సభ్యులు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.మృతుడి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# నంది అవార్డు అందుకున్న సామాజిక సేవకురాలు

మంచిర్యాల, మే 28,తెలంగాణ పత్రిక.

హైదరాబాద్ పట్టణం రవీంద్ర భారతిలో తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ అసోసియేషన్ 5వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన "శ్రీ మహానంది అవార్డ్స్" కార్యక్రమంలో రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు పల్లె లక్ష్మణ్ రావు గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంచిర్యాల కు చెందిన(భవాని మ్యారేజ్ బ్యూరో )కురుమిళ్ల రాధ -శ్రీనివాస్ గత 5 సంవత్సరాల నుండి చేసిన సేవలకు మెచ్చి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మ్యారేజ్ బ్యూరో రంగంలో విశిష్ట




సేవలు అందిస్తున్న వారికి, అలాగే వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన ప్రముఖులకు అవార్డులు ప్రదానం చేయడం జరిగింది.కుటుంబ సభ్యుల,మరియు నా తోటి మ్యారేజ్ బ్యూరో మిత్రుల సమక్షంలో ఈ అవార్డు తీసుకోవడం చాలా



సంతోషం గా ఉందన్నారు .నా సేవలను గుర్తించి నాకు నంది అవార్డు రావడానికి కృషి చేసిన మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళా చట్టాలపై సదస్సు

జగిత్యాల మే 28 తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి

తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం జిల్లా కేంద్రం లోని సీనియర్ సిటిజెన్స్ కార్యాలయంలో మహిళా వారోత్సవాల సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 16మంది మహిళలను సన్మానించారు.ఈ సందర్భంగా గృహ హింస, బాల్య వివాహాల నిరోధక చట్టాలపై రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కృష్ణా రెడ్డి,పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం సమానత్వ వేతన చట్టంలపై



సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు న్యాయ వాది హరి అశోక్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ సదస్సులో మాజీ మున్సిపల్ చైర్మన్ జీ ఆర్. దేశాయ్, సీనియర్ సిటిజెన్స్ జిల్లా కార్యదర్శి గౌరి శెట్టి విశ్వనాథం,సహాయ అ ధ్యక్షులు బొల్లం విజయ్, ఉపాధ్యక్షులు వి. ప్రకాష్, ఎం. డి. యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కే. సత్యనారాయణ, మహిళా కార్యదర్శి బొబ్బాటి కరుణ, కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం, జగిత్యాల పట్టణ అధ్యక్షులు మానాల కిషన్, జగిత్యాల డివిజన్ అధ్యక్షులు బి. రాజేశ్వర్,ధర్మపురి అధ్యక్షులు కండ్లె గంగాధర్, కార్యదర్శి దుబ్బెశం, బాలయ్య, ప్రసాద్, నారాయణ, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మాజీఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

పెద్దపల్లి, ప్రతినిధి మే 28 ( తెలంగాణ పత్రిక )

బక్రీద్ పండుగ సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు ముగించుకొని బయటికి వస్తున్న ముస్లిం సోదరులకు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పలాయ్ భజాయి చేస్తూ బక్రీద్ శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, త్యాగానికి, దైవ భక్తికి ప్రతీక అయిన బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా) పండుగను ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని పేర్కొన్నారు. సమాజంలో ప్రేమ,



సోదరభావం, పరస్పర గౌరవం పెంపొందించే పండుగలలో బక్రీద్ ఒక ముఖ్యమైన పండుగనిఅన్నారు.అల్లా యొక్క ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని,పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. మత సామరస్యాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజకుమార్, నాయకులు మోబిన్, సరేష్, నూగిళ్ల వీరేశం, మహమ్మద్ ఖాదర్, అతిక్, షరీఫ్, ముస్లిం మత పెద్దలు నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్య వైఖరికి నిరసనగా బిఆర్ఎస్ ధర్నా





-ధాన్యం తడిసి ముద్దవుతున్న అధికారులు స్పందించడం లేదని ఎమ్మెల్యే ఆగ్రహం

-ప్రభుత్వం రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని

-నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హెచ్చరించారు

వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 28 (తెలంగాణ పత్రిక):

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా గురువారం వెల్దుర్తి మండల కేంద్రమైన ఆరెగూడెం చౌరస్తా వద్ద బిఆర్ఎస్ పార్టీ రైతులు నిర్వహించిన ధర్నాలోపాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆమె తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తోందని, మాటల్లో మాత్రమే రైతు సంక్షేమం చెబుతూ క్షేత్రస్థాయిలో మాత్రం రైతులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన ఏర్పాట్లు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోజుల తరబడి ధాన్యం కొనుగోలు కాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉంచిన ధాన్యం తడిసి ముద్దవుతున్నా అధికారులు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని ఉంటే రైతులకు ఈ పరిస్థితి వచ్చేదే కాదని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. సరైన గోదాములు, టార్పాలిన్లు, రవాణా సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో రైతులు పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందనిఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేసింది. రైతు బంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులతో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేశాం. ముఖ్యంగా రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేసి వారికి మద్దతుగా నిలిచామన్నారు. రైతు నష్టపోతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, తడిసిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించాలని, రైతులకు తక్షణ పరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎమ్మెల్యే



సునీత లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఘటన స్థలానికి చేరుకున్న తూప్రాన్ సిఐ వెంకట్ రాజ్ గౌడ్ వెల్దుర్తి ఎస్ఐ రాజు పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి రమేష్ గౌడ్, బి ఆర్ ఎస్ వెల్దుర్తి మండల పార్టీ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, వెల్దుర్తి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు రంగి కృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణ గౌడ్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు అశోక్ రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు శాకారం శ్రీనివాస్ గౌడ్, వెల్దుర్తి పట్టణ అధ్యక్షులు జగ్గా అశోక్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు పడిగే నర్సింలు, శ్రీనివాస్ రెడ్డి, శ్రవణ్ కుమార్, మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



కామారెడ్డి ,మే 28, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లామాచారెడ్డి మండలంలోని లచ్చపేట మహాబాల రైస్ మిల్ లక్ష్మీరావులపల్లి ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్ కలిసి గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోళ్లు, అన్‌లోడింగ్ ప్రక్రియ, రవాణా ఏర్పాట్లను సమీక్షించారు. ధాన్యం సకాలంలో మిల్లులకు తరలించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా డ్రైవర్ల కొరత లేకుండా రవాణా కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు జిల్లా కలెక్టర్ ఇటీవల రవాణాదారులతో సమావేశం నిర్వహించి, నిరంతర రవాణా సేవలు కొనసాగించాలని ఆదేశించారు. వరి రవాణాలో పాల్గొంటున్న డ్రైవర్ల సేవలను అభినందిస్తూ, ముఖ్యంగా మహారాష్ట్ర , కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన డ్రైవర్లకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ దుస్తులు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. జిల్లా యంత్రాంగం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని రవాణాదారులు, డ్రైవర్లు అభినందిస్తూ, వరి ధాన్యం సకాలంలో తరలింపునకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రవాణాదారులు, డ్రైవర్లు, మిల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వీఓఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

-సిపిఎం పార్టీ డిమాండ్



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 28, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రంలో గత పది రోజులుగా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న వీఓఏ (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్)లను ఈరోజు సిపిఎం పార్టీ నాయకులు కలిసి తమ సంఘీభావం తెలిపారు. వీఓఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు గురిజాల శ్రీధర్ మాట్లాడుతూ.. వీఓఏలు గ్రామీణ స్థాయిలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ సరైన వేతనాలు, ఉద్యోగ భద్రత లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారికి కనీస వేతనం రూ.20 వేలుగా నిర్ణయించాలని, సెర్ప్ (ఎస్ఈఆర్పీ) ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ వర్తింపజేయాలని కోరారు.అలాగే అర్హులైన వీఓఏలకు సీసీలుగా పదోన్నతులు కల్పించాలని, సాధారణ మరియు ఆరోగ్య భీమా కింద రూ.20 లక్షల భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ట్యాబ్‌లు, ఇంటర్నెట్ సౌకర్యం అందించడంతో పాటు 58 జీఓను సవరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేసి, వేతనాలను నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, పని భారం తగ్గించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో మంత్రి మణెమ్మ, కొనుగంటి భాగ్యలక్ష్మి, గుండెల్లి వరలక్ష్మి, మార మహేందర్, చంద్రగిరి మల్లేశ్వరి, అక్కనపెల్లి కాంతవ్వ, మల్లారపు జయసుధ, బొంగాని జ్యోతి, వంచ మమత, నర్సింగ్, రోజా కళావతి, పెరుక అనిత, కట్ట అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం దిగుమతి చేపట్టాలి

-ఆర్డీవో జయచందర్ రెడ్డి

వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 28 (తెలంగాణ పత్రిక):

మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని శ్రీ శివ సాయి రైస్ మిల్లును గురువారం తూప్రాన్ ఆర్డీవో జయచందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మిల్లుల్లో నిల్వ ఉంచిన ధాన్యం, ఖాళీ గోదాములను పరిశీలించి సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే మిల్లుల్లో నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేసి ధాన్యం నిల్వల పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యం లారీలను ఆలస్యం చేయకుండా వెంటనే దిగుమతి చేసుకొని తిరిగి కొనుగోలు కేంద్రాలకు పంపించాలని మిల్లర్లకు సూచించారు. రైతులు ధాన్యం అమ్మకాల



విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హమాలీలను అవసరానికి అనుగుణంగా ఏర్పాటు చేసుకొని వేగవంతంగా ధాన్యం దిగుమతి చేపట్టాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరిగితే రైతులు నష్టపోతారని పేర్కొన్నారు. ధాన్యం సేకరణ, నిల్వ, రవాణా ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించి రైతులకు ఇబ్బందులు



తలెత్తకుండా అధికారులు, మిల్లర్లు కలిసి పనిచేయాలని ఆర్డీవో జయచందర్ రెడ్డి సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ నర్సింగ్ యాదవ్ శ్రీ శివ సాయి రైస్ మిల్ యజమాని భైరవదాస్ తదితరులు పాల్గొన్నారు.

# రేయింబవళ్లు కష్టపడి పండించిన పంట







-చెమటోడ్చి సాగు చేసిన ధాన్యం...

-అన్నదాత ఆశలన్నీ ఒక్కసారిగా అకాల వర్షం నీటిలో కలిసిపోయాయి.

-ఇప్పుడు ఇది కూడా పోతే మా కుటుంబాలు ఎలా బతుకుతాయి

-ఆగ్రహించిన రైతులు రోడ్డెక్కి నిరసన చేపట్టారు.

వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 28 (తెలంగాణ పత్రిక):

రేయింబవళ్లు కష్టపడి పండించిన పంట... చెమటోడ్చి సాగు చేసిన ధాన్యం... అన్నదాత ఆశలన్నీ ఒక్కసారిగా అకాల వర్షం నీటిలో కలిసిపోయాయి. పొలం దున్నిన నాటి నుంచి రైతు జీవితం పోరాటంగానే మారింది. విత్తనాల కోసం అప్పులు... ఎరువుల కోసం అప్పులు... పురుగుమందుల కోసం అప్పులు... ఇలా ప్రతి అడుగులోనూ అప్పుల బారిన పడుతూ రైతు పంటను సాగు చేశాడు. ఎండలు, కరువు, విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటూ పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నాడు. చివరకు పంట చేతికొచ్చిందని ఆనందపడేలోపే ప్రకృతి రైతుపై మళ్లీ పగబట్టింది. అకాల వర్షాలు రైతన్న ఆశలపై నీళ్లు చల్లాయి. కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉంచిన ధాన్యం పూర్తిగా తడిసి ముద్దైంది. తార్పాలిన్లు లేకపోవడం, సరైన గోదాములు లేకపోవడంతో వర్షపు నీటిలో ధాన్యం తేలిపోయింది. రైతులు కళ్లముందే తమ కష్టం నాశనమవుతుండటాన్ని చూసి కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. " ఆరు నెలలుగా మొత్తం కష్టపడి పండించిన పంట ఇది... ఇప్పుడు ఇది కూడా పోతే మా కుటుంబాలు ఎలా బతుకుతాయి" అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి రోజుల తరబడి ఎదురుచూస్తున్నామని, అధికారులు సమయానికి స్పందించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేదే కాదని మండిపడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయబోమని చెబుతుండటంతో రైతుల గుండెల్లో మరింత ఆందోళన నెలకొంది. అప్పులు తీర్చలేక, పెట్టుబడులు తిరిగి రాక రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. కుటుంబ పోషణ ఎలా అనే భయం వారిని వెంటాడుతోంది. ఆగ్రహించిన రైతులు రోడ్డెక్కి నిరసన చేపట్టారు. "మా ధాన్యం కొనాలి... మాకు న్యాయం చేయాలి" అంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. అన్నం పెట్టే రైతన్న ఈరోజు కన్నీరు పెట్టుకుంటున్నాడు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. అలాంటి రైతును ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని రైతు సంఘాలు చెబుతున్నాయి. అకాల వర్షం రైతు ఇంట్లో చీకట్లు నింపింది... అన్నదాత కష్టం నీటిపాలైంది... ఇప్పుడు రైతన్న ఎదురు చూస్తోంది ఒక్కటే... ప్రభుత్వ సహాయం కోసం.

# ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బోయినిపల్లి మండల కాంగ్రెస్ నూతన అధ్యక్షుడు సువీన్ యాదవ్

-సువీన్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపిన విప్.. శాలువాతో ఘన సత్కారం

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 28, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కొమ్మనబోయిన సువీన్ యాదవ్ ఈరోజు వేములవాడ శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సువీన్ యాదవ్‌కు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా



వ్యవహరిస్తూ పార్టీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న ఆది శ్రీనివాస్, సువీన్ యాదవ్ కుటుంబంతో తమకు దశాబ్దాలుగా ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు.ముఖ్యంగా మల్లేష్ యాదవ్‌తో ఉన్న స్నేహబంధం, రాజకీయ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ ఆ కుటుంబం పార్టీ కోసం, ప్రజా సేవ కోసం చేసిన కృషిని కొనియాడారు. అదే నిబద్ధతతో సువీన్ యాదవ్ కూడా ప్రజల్లో ఉండి ముందుకు సాగాలని సూచించారు.ఈ మర్యాదపూర్వక సమావేశంలో తడగొండ గ్రామ సర్పంచ్ ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ చేపూరి వెంకటేష్, మైనారిటీ నాయకులు మహమ్మద్ హుస్సేన్, ఇటీవల ఎంపికైన ఆత్మ (ఏటీఎంఏ) కమిటీ సభ్యుడు గుడి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ.. సువీన్ యాదవ్ యువ నాయకత్వంలో బోయినిపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా సమిష్టిగా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# తెలంగాణను అవమానించే వ్యాఖ్యలు సహించం

-చంద్రబాబు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి: బీఆర్ఎస్వీ నేత కంచర్ల రవి గౌడ్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 28, తెలంగాణ పత్రిక

మహానాడు వేదికగా తెలుగుదేశం పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించే విధంగా ఉన్నాయని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు."తెలంగాణ" అనే పదం డిక్షనరీలో లేదని టిడిపి నాయకులు మాట్లాడటం వారి అహంకారానికి, తెలంగాణపై ఉన్న ద్వేషానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేలాది మంది యువకులు ప్రాణత్యాగాలు చేస్తే, ఇప్పుడు అదే తెలంగాణను అవమానించేలా మాట్లాడటం అత్యంత



దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు.తెలంగాణను ఎప్పుడూ చులకనగా చూసే చంద్రబాబు నాయుడు సంస్కృతి ఇప్పటికీ టిడిపి నాయకుల్లో కనిపిస్తోందని అన్నారు. తెలంగాణ ప్రజలు టిడిపిని రాజకీయంగా ఎప్పుడో తిరస్కరించారని, అయినప్పటికీ ఇంకా తెలంగాణపై విషం కక్కడం సిగ్గుచేటని విమర్శించారు.బక్క నర్సింలు చేసిన వ్యాఖ్యలు చంద్రబాబు డైరెక్షన్‌లోనే వచ్చాయని ఆరోపించిన రవి గౌడ్, తెలంగాణలో పుట్టి పెరిగి ఆంధ్ర నాయకులను మెప్పించేందుకు మాట్లాడటం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలను కించపరిచేలా మాట్లాడిన వారిని ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.తెలంగాణను అవమానించే వ్యాఖ్యలపై చంద్రబాబు నాయుడు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే తెలంగాణ వ్యాప్తంగా టిడిపి నాయకులను ప్రజలు ఎక్కడికక్కడ అడ్డుకుంటారని, బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో నిరసనలు చేపడతామని హెచ్చరించారు. "తెలంగాణ కోసం పోరాడిన ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వారిని ఈ నేల ఎన్నటికీ క్షమించదు" అని కంచర్ల రవి గౌడ్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు మట్టే శ్రీనివాస్, ఆరేళ్ల వినయ్ కుమార్, అల్లే గణేష్, మిట్టపల్లి రాజు, కిరణ్, రాజు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపుల జోరు .. ఎక్సైజ్ మొద్దు నిద్ర

-మండలంలో జోరుగా బెల్ట్ షాపు దందా
-సామాన్యుని కుదిపేస్తున్న బెల్టు షాపుల మహమ్మారి

గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే 28

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో వైన్ షాపుల సిండికేట్ వల్ల అధిక ధరలకు మద్యం అమ్ముతూ సామాన్య కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో మునిగిపోతున్నాయి మండల కేంద్రంతోపాటు గ్రామాలలో వైన్ షాపులు సిండికేట్‌గా మారి బెల్ట్ షాపులను విపరీతంగా పెంచుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారిక ధరల కంటే అధికంగా మద్యం విక్రయించడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు పలు ప్రాంతాల్లో ఒక్కో బాటిల్‌పై రూ20 నుంచి రూ 50 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మండలంలో బెల్ట్ షాపులు దందా జోరుగా కొనసాగుతుంది రోజంతా కష్టపడిన డబ్బును బెల్ట్ షాపులకి ధారపోయవలసి వస్తుందని సామాన్య ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఎక్సైజ్ అధికారులకు ముడుపులు అందిస్తూ బెల్ట్ షాప్ నిర్వాహకులకు బాసటగా నిలుస్తున్నారని బెల్ట్ షాప్ నిర్వాహకుల నుండి ఎక్సైజ్ అధికారులకు ముడుపులు పోతున్నాయని




మమ్మల్ని ఎవరు ఏమి చేయలేరని సిండికేట్ యజమానులు ధీమా వ్యక్తం చేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు మద్యం కూడా కల్తీ మద్యం అమ్ముతున్నారని ప్రజలు ఆవేదన చెందుతు తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి మండలంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపు దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనధికార బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల్లో కూడా మద్యం అందు బాటులోకి తీసుకురావడంతో యువత, కూలీలు మద్యం వ్యసనానికి గురవుతున్నారని ప్రజా



సంఘాలు ఆరోపిస్తున్నాయి. కుటుంబాల ఆదాయం మొత్తం మద్యానికే ఖర్చవడంతో అనేక కుటుంబాలు అప్పుల బారిన పడుతున్నాయి. అధిక ధరలు, అప్పుల ఒత్తిడి, కుటుంబ కలహాల కారణంగా కొంత మంది మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్న ఘటనలు మండ లంలో చోటుచేసుకుంటున్నాయని ఆయా గ్రామాల స్థానికులు చెబుతున్నారు. బెల్ట్ షాపుల నియంత్రణలో అధికారుల నిర్లక్ష్యం ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. సిండికేట్ విధానంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని అక్రమ బెల్ట్ షాపులను వెంటనే మూసివేయాలని, మద్యం విక్రయాలను నియంత్రించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# సేకరించిన ధాన్యం ఎప్పటికప్పుడు తరలించాలి

-అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
-ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు అందుబాటులో ఉంచాలి
-వేములవాడ రూరల్, బోయినిపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 28, తెలంగాణ పత్రిక

రైతుల నుంచి సేకరించిన ధాన్యం ఎప్పటికప్పుడు మిల్లులు, గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, సంబంధిత ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు ధాన్యం తరలించేందుకు సరిపడా వాహనాలు సమకూర్చాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. గురువారం వేములవాడ రూరల్ మండలం వట్టెంల, ఫాజుల్ నగర్, బోయినిపల్లి మండల కేంద్రం, కోరెం, బూరుగుపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి,



కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించి ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని త్వరగా తూకం వేసి తరలించాలని, రైతులకు క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. వర్షం




కారణంగా తడిసిన ధాన్యం విషయంలో రైతులు అధైర్యపడకుండా ధాన్యం సేకరిస్తామని భరోసా కల్పించాలని సూచించారు. రైతులు ఆందోళన చెందకుండా అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. తూకం వేసిన ధాన్యం లోడింగ్ చేయడం కోసం హమాలీల సంఖ్య పెంచుకుని కొనుగోళ్ల ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.

# ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

-ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు పండ్లు పంపిణీ చేసిన టిడిపి రాష్ట్ర నాయకులు మాజీ సర్పంచ్ జడ రాములు యాదవ్

వేములపల్లి ప్రతినిధి మే 28 ( తెలంగాణ పత్రిక ):-

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు, విశ్వవిఖ్యాత,నటసార్వభౌమ స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు 103 వ జయంతిని పురస్కరించుకొని వేములపల్లి మండల కేంద్రంలో టిడిపి రాష్ట్ర నాయకులు మాజీ సర్పంచ్ జడ రాములు యాదవ్ గారి ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు పండ్ల పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించారని



పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల్లోనే రాజ్యాధికారాన్ని చేజిక్కించుకున్న గొప్ప రాజకీయ దురంధరుడు గా నందమూరి తారక రామారావు ను కీర్తించారు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతోనే సమాజంలో పెను మార్పులు వచ్చాయని పటేల్ పట్వారి వ్యవస్థ రద్దు తో పాటుగా రెండు రూపాయలకే కిలో బియ్యం ఇవ్వడం మహిళలకు ఆస్తిలో సమానపు హక్కుచట్టాన్ని ప్రవేశపెట్టడం అన్ని వర్గాలకు చట్టసభలకు వెళ్లేందుకు అవకాశాలు కల్పించడం లాంటి విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టినటువంటి గొప్ప నాయకుడు నందమూరి తారక రామారావు గారు అని కొనియాడారు ఈ కార్యక్రమంలో వేములపల్లి ఉపసర్పంచ్ గుండెబోయిన మల్లయ్య యాదవ్,వార్డు మెంబర్స్ జడ మహేశ్వరి సైదులు యాదవ్, వలపట్ల మాధవి రమేష్, పార్టీ కార్యకర్తలు జడ మల్లేష్, నన్నే బోయిన సైదులు, చిలకల నాగయ్య, గంగుల వెంకన్న, గుండెబోయిన సతీష్, జడ శ్రీకాంత్, పగిళ్ల శివ మరియు ఎన్టీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యం విషయంలో రైతులు ఆందోళన చెందకుండా అవగాహన కల్పించాలి

-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
-ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 28, తెలంగాణ పత్రిక

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ తుది దశకు చేరుకుందని, ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో ముగిసే వరకూ అధికారులు ఇదే చొరవతో పని చేస్తూ రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ధాన్యం సేకరణ, తడిసిన ధాన్యం విషయంలో రైతులు ఆందోళన చెందకుండా క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించడం, అన్ లోడింగ్ వేగవంతం చేయడం కోసం కొనుగోలు కేంద్రాల వద్ద నుండి అపరల్ పార్క్ కు హమాలీలను తరలించడం, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా, తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ గురువారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో నిన్నటివరకు 2 లక్షల 23 వేల 709 మెట్రిక్



టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని కలెక్టర్ వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండేలా చూడాలని, వర్షం కారణంగా ధాన్యం తడిస్తే రైతులు ఆందోళన చెందకుండా అధికారులు అవగాహన కల్పించి, ధాన్యం కొనుగోలు చేస్తామనే భరోసా క్షేత్ర స్థాయిలో కల్పించాలని ఆదేశించారు.కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వారీగా ధాన్యం సేకరణ, అన్ లోడింగ్ పై ఆరా తీసి, ప్రక్రియ వేగవంతంగా సజావుగా పూర్తయ్యేవరకు అధికారులు ఇదే చొరవతో పని చేయాలని, రాబోయే వారం రోజుల్లోగా కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేసేలా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో ఉన్న హమాలీలను ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేయడం కోసం అపరల్ పార్క్ కు తరలించాలని, తద్వారా వాహనాలు తొందరగా అన్ లోడింగ్ జరిగి అవసరమైన కేంద్రాలకు వాహనాలను పంపడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి ఎప్పటికప్పుడు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేసేలా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేయాలని అధికారులకు సూచించారు. వాహనాల కొరత లేకుండా సరైన పర్యవేక్షణ చేయాలని, సంబంధిత ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు సమకూర్చేలా చూడాలని ఆదేశించారు. మిల్లర్లు వారికి కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

# కామారెడ్డిలో అంతరాష్ట్ర కిడ్నాప్ ముఠా కలకలం

-వ్యాపారవేత్త కిడ్నాప్‌కు యత్నం
-జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర




కామారెడ్డి , మే 28,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లాలో ఒక ప్రముఖ వ్యాపారవేత్తను అక్రమ తుపాకీతో బెదిరించి, కిడ్నాప్ చేసి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేయాలని చూసిన అంతరాష్ట్ర ముఠా కుట్రను తాడ్వాయి పోలీసులు అత్యంత చాకచక్యంగా భగ్నం చేశారు. పక్కా సమాచారంతో దాడి చేసి అక్రమ ఆయుధాలు, బుల్లెట్లతో సహా ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ సంచలన కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర పాత్రికేయులకు వెల్లడించారు. పోలీసుల అప్రమత్తతతో దొరికిన ముఠాఈ నెల 27వ తేదీన తాడ్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణాజీవాడి శివాలయం సమీపంలో కొంతమంది అనుమానితులు గుమిగూడి ఏదో పెద్ద నేరానికి పన్నాగం పన్నుతున్నట్లు పోలీసులకు నమ్మదగిన సమాచారం అందింది. దీంతో తాడ్వాయి ఎస్ఐ తన సిబ్బందితో కలిసి తక్షణమే అక్కడికి చేరుకున్నారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన నిందితులను సిబ్బంది వెంబడించి చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ఎల్లారెడ్డి డీఎస్పీ యస్. శ్రీనివాస్ రావు పర్యవేక్షణలో సదాశివనగర్ సిఐ సంతోష్ కుమార్, తాడ్వాయి ఎస్ఐ నరేష్, సదాశివనగర్ ఎస్ఐ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పినరయి విజయన్ ఇంటి పై దాడులను ఖండించిన సిపిఎం నాయకులు




మిర్యాలగూడ ప్రతినిధి//మే 28:(తెలంగాణ పత్రిక):-

కేరళ మాజీ ముఖ్యమంత్రి సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యుడు పినరయి విజయన్ ఇంటిపై ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ చేపట్టిన దాడులను సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లేష్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు సిఐటియు నాయకులు మల్లు గౌతమ్ రెడ్డి ఖండించారు. గురువారం నాడు స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకరులు సమావేశంలో వారు మాట్లాడుతూ కేరళలో బిజెపి కాంగ్రెస్ అపవిత్ర పొత్తు బయటపడిందని ఇద్దరు కలిసి మాజీ సీఎం పిన్నరై విజయన్ అతని కుటుంబాన్ని టార్గెట్ చేయటం సరికాదన్నారు. కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కేంద్రంలోని బిజెపితో కుమ్ముక్కై అర్థం పర్థం లేని పాత కేసులో మనీ ల్యాండరింగ్ అంటూ ఈడి విజయన్ ఇంటిపై దాడి చేయించారని ఇది రాజ్యాంగ విరుద్ధమని వారు తెలిపారు. నిబద్ధతకు నిదర్శనంగా ఉన్న విజయన్ తన పదవి కాలం ముగిసిన వెంటనే అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారని అలాంటి వ్యక్తిపై కేసులు నమోదు చేయటం దారుణమన్నారు. ఇలాంటి దాడులకు సిపిఎం నాయకులు ఎవరు కూడా భయపడరని ధైర్యంగా ఎదుర్కొంటారని వారు తెలిపారు. సమావేశంలో సిపిఎం నాయకులు సైదులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## "అమ్మవారికి జేష్ఠ మాస అధిక వాయినాలు"

కామారెడ్డి ,మే 28 ,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లాబీబీ పేట గ్రామంలో శ్రీ నగరేశ్వర దేవాలయంలో కొలువై ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అధిక జ్యేష్ఠ మాస సందర్భంగా ఆలయంలో వాసవి క్లబ్ , ఆర్యవైశ్య సంఘం మహిళలు ఏకరూప దుస్తులతో శ్రీ కన్యక పరమేశ్వరి అమ్మవారికి అధిక జ్యేష్ఠ మాస వాయినాలు అర్చకులు శ్రీ మనోజ్ పాండే ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన తదనంతరం అమ్మవారికి ముట్టించారు. ఇట్టి కార్యక్రమంలో బిబిపేట ఆర్యవైశ్య సంఘం , వాసవి క్లబ్ మహిళలు పాల్గొన్నారు.

## జిల్లాలో ముస్లిం సోదరులు బక్రీద్ పండగను ఘనంగా జరుపుకున్నారు



కామారెడ్డి, మే 28 , ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

పవిత్రమైన బక్రీద్ పండగను గురువారం కామారెడ్డి జిల్లాలోని అన్ని పట్టణాలు గ్రామాలలో ముస్లిం సోదరులు దర్గాల వద్ద మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి ఘనంగా జరుపుకున్నారు. కులమత విభేదాలు లేకుండా హిందువులు సైతం ముస్లిం సోదరులను కలిసి బక్రీద్ పండగ శుభాకాంక్షలు స్వీట్లు పంచుకున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన రంజాన్ ఉత్సవాలలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ముఖ్యఅతిథిగా పాల్గొనగా ఆయా నియోజకవర్గాలలో జరిగిన బక్రీద్ పండగ సంబరాలలో ఆయా మండలాల కాంగ్రెస్ అధికార పార్టీ నాయకులు పాల్గొని ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. దోమకొండ మండల కేంద్రంలో సైతం మండల కాంగ్రెస్ నాయకుడు ముస్లిం సోదరులను కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపి ఒకరినొకరు ఆలింగనం చేసుకుని సంబరాల్లో పాల్గొన్నారు.

## హైమస్ లైట్ల కోసం వినతి పత్రం అందించిన బండ రమేష్

గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే 28



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన రాష్ట్ర వక్ఫు బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్ రంజాన్ పర్వదినం పురస్కరించుకొని గ్రామానికి రాగా ముస్తఫానగర్ మాజీ వార్డు సభ్యులు బండ రమేష్ మర్యాద పూర్వకంగా వారినీ వారి నివాసంలో కలిసి శాలువాతో సన్మానించి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు అనంతరం ముస్తఫానగర్ గ్రామం లోనీ అంబేద్కర్ విగ్రహం వద్ద హైమాస్ లైట్లు కావాలని వారికి వినతి పత్రం అందజేశారు వినతి పత్రం అందుకున్న అజ్మతుల్లా హుస్సేన్ త్వరలోనే హైమస్ లైట్ల ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని తెలిపారు అడగగానే సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపిన అజ్మతుల్లా హుస్సేన్ కు బండ రమేష్ కృతజ్ఞతలు తెలిపారు

## 31న కామారెడ్డిలో రౌండ్ టేబుల్ సమావేశం



కామారెడ్డి ,మే 28,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కాళేశ్వరం 22 ప్యాకేజ్ లో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రయత్నంలో భాగంగా కామారెడ్డిలో ఈ నెల 31న కర్షక్ బిఈడి కళాశాలలో ఉదయం జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో అన్ని రాజకీయ పక్షాల నాయకులు మేధావులు పాల్గొని వాస్తవాలను వెల్లడించాలని దోమకొండ మండలం అంబారిపేట మాజీ ఎంపీటీసీ ఫిరంగి రాజేశ్వరరావు కోరారు. ఈ మేరకు రౌండ్ టేబుల్ సమావేశానికి సంబంధించిన కరపత్రాలను దోమకొండ గ్రామపంచాయతీ ఆవరణలో స్థానిక సర్పంచ్ ఐరన్ నరసయ్య ఉపసర్పంచ్ బొమ్మెర శ్రీనివాస్ మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆశ్రమం బోయిన శ్రీనివాస్ నాయకులు అనంతరెడ్డి డైరెక్టర్ గోపాల్ రెడ్డి లు ఆవిష్కరించారు.

## కాలు ఆపరేషన్ నిమిత్తమై ఏ పాజిటివ్ రక్తం అందజేత

-సకాలంలో రక్తాన్ని అందజేసిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ కస్వ సుజిత్

కామారెడ్డి ,మే 28,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతి నిధి)

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ వైద్యశాలలో ప్రమాదంలో గాయపడిన భూమయ్య (48)కు కాలు ఆపరేషన్ నిమిత్తమై ఏ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో వారికి కావలసిన రక్తనిధి కేంద్రాలలో లభించకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు ను సంప్రదించడంతో వారికి కావాల్సిన రక్తాన్ని పట్టణానికి చెందిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ కస్వ సుజిత్ సహకారంతో సకాలంలో అందజేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ ప్రస్తుతం వేసవికాలం కావడం వలన పట్టణంలోని రక్తనిధి




కేంద్రాలలో రక్త నిల్వలు పూర్తిగా తగ్గిపోవడం జరిగిందని చాలామంది రక్తదానం చేయడం వలన బలహీనతలు ఏర్పడతాయని ముందుకు రావడంలేదని రక్త దానం చేసే వారికి ఎలాంటి బలహీనతలు ఏర్పడమని ప్రతి సంవత్సరం రెండుసార్లు రక్తదానం చేయడం వలన గుండెజబ్బు,క్యాన్సర్, కొలెస్ట్రాల్ వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని ఎన్నో సర్వేలు తెలియజేయడం జరిగిందని దీనిని దృష్టిలో పెట్టుకొని ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని,ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. రక్త దానానికి ముందుకు వచ్చిన సుజిత్ కు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎర్రం చంద్రశేఖర్, కోశాధికారి కస్వ వెంకటేష్,ప్రధాన కార్యదర్శి దొంతి సుధాకర్ లు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆటల పోటీలు

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 29

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భముగా జనరల్ మేనేజర్ కొత్తగూడెం ఏరియా ఎం. షాలేం రాజు ఆదేశానుసారం కొత్తగూడెం ఏరియాలోని మహిళలకు 28.05.2026 నుండి 30.05.2026 వరకు ఆటల పోటీలు నిర్వహించబడును. అందులో భాగంగా గురువారం జిఎం కార్యాలయం , 3 ఇంక్లైన్ లేడీస్ క్లబ్ నందు మహిళలకు ఆటల పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ ఓ టు జీఎం కోటిరెడ్డి హాజరై ఈ ఆటల పోటీలను ప్రారంభించడం జరిగింది ఈ పోటీలలో గెలుపొందిన మహిళలకు జూన్ 2వ తేదీన రుద్రంపూర్ ప్రగతి వనం నందు సాయంత్రం నిర్వహించబడే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో బహుమతులు ప్రధానం చేయబడునని ఈ సందర్భంగా ఎస్ ఓ టు జీఎం కోటిరెడ్డి తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జీఎం కోటిరెడ్డి తో పాటు ఏజీఎం( ఫైనాన్స్) బీభత్సా పర్సనల్ మేనేజర్ ఎల్ తిరుపతి ,( డి వై



పి ఎం) హరీష్ వెల్ఫేర్ ఆఫీసర్ విక్టర్ సీనియర్ పి.ఓ. మజ్జి మురళీ, సేవకో-ఆర్డినేటర్ సి.హెచ్. సాగర్, ఇతర అధికారులు మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జయంతి

-తెలుగు జాతి కీర్తి ని ప్రపంచావ్యాప్తంగా తెలియజేసిన వ్యక్తి స్వర్గీయ ఎన్టీఆర్

-స్వర్గీయ ఎన్టీఆర్ ఆశయాలు తెలుగు ప్రజలకు ఆదర్శం.. ఎమ్మెల్యే బిఎల్ఆర్

మిర్యాలగూడ ప్రతినిధి//మే 28:(తెలంగాణ పత్రిక):-

తెలుగుజాతి కీర్తి పతాకాన్ని ప్రపంచవ్యాప్తంగా ఎగురవేసిన విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు 103వ జయంతి వేడుకల్లో భాగంగా ఈరోజు మిర్యాలగూడ నియోజకవర్గ కేంద్రంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతు ఎన్టీఆర్ భౌతికంగా మన మధ్య లేకపోయినా తెలుగు ప్రజల గుండెల్లో ఆయన ఎప్పటికీ జీవించే ఉంటారు అని అన్నారు. సినిమా రంగంలోనే కాకుండా రాజకీయాల్లోనూ ఆయన సృష్టించిన నూతన ఒరవడి చిరస్మరణీయం అని అన్నారు. పేదలకు రూ.2 కేజీల బియ్యం, జనతా వస్త్రాలు, పక్కా గృహాల వంటి చారిత్రాత్మక పథకాలను ప్రవేశపెట్టి సంక్షేమ పాలనకు ఆయనే నిజమైన నిర్వచనం ఇచ్చారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ఆయన చేసిన సేవలు ఎప్పటికీ మరవరానివి అని కొనియాడారు. ఎన్టీఆర్ కేవలం ఒక పార్టీకి పరిమితమైన నాయకుడు కాదు, ఆయన యావత్ తెలుగు జాతి ఆస్తి. రాజకీయాలు వేరైనా, తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడిన ప్రజా నాయకుడిగా ఆయన ఆశయాలను, స్ఫూర్తిని



గౌరవించడం మన అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ఎన్టీఆర్ అభిమాన సంఘాల ప్రతినిధులు, మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని నివాళులర్పించారు.

## పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన గౌడ విద్యార్థిని విద్యార్థులకు ప్రజా ప్రతినిధులకు జై గౌడ ఉద్యమం ఆధ్వర్యంలో సన్మానం నిర్వహిస్తాం

-జై గౌడ ఉద్యమం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రంగోల్ల మురళి గౌడ్

కామారెడ్డి ,మే 28, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

జై గౌడ ఉద్యమం ఆధ్వర్యంలో పదో తరగతి ,ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన గౌడ విద్యార్థులకు, అలాగే ఇటీవల ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు ,ఇతర నాయకులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కామారెడ్డిజిల్లా అధ్యక్షుడు రంగోల్ల మురళి గురువారంతెలిపారు. ఈ సన్మాన కార్యక్రమం శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని కర్షక్ బీఈడీ కళాశాల లో వైభవంగా నిర్వహించబడనుంది. విద్య, సామాజిక సేవ మరియు ప్రజా నాయకత్వ రంగాల్లో ప్రతిభ కనబరిచిన గౌడ బంధువులను ప్రోత్సహించడం



లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు రంగోల్ల మురళి మాట్లాడుతూ, గౌడ సమాజ యువత విద్యా రంగంలో మరింత ముందుకు రావాలని, అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించడం ద్వారా ఇతరులకు స్ఫూర్తిగా నిలపాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ఇటీవల గ్రామాలు, పట్టణాల్లో ప్రజా సేవకు ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు మరియు ఇతర ప్రజా ప్రతినిధులను సన్మానించడం ద్వారా సమాజ ఐక్యతను చాటాలని అన్నారు. ఈ కార్యక్రమానికి గౌడ బంధువులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమ ఏర్పాట్లలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంకన్న గారి శ్రీనివాస్ గౌడ్, ఇందూరి సిద్ధా గౌడ్, నరేష్ గౌడ్, కరోల్ల శేఖర్ గౌడ్, అంకన్న గారి గంగాధర్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, దేవేందర్ గౌడ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి దూడ మృతి

ముధోల్: 28మే(తెలంగాణ పత్రిక)

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో మండలంలోని మచ్కల్ గ్రామంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి దూడ తగిలి మృతి చెందిన సంఘటన నెలకొంది. వివరాల్లోకెళ్తే గ్రామానికి గంగాధర్ అనే రైతుకు చెందిన దూడ మేత కోసం ప్రమాదానికి గురై మృతి చెందింది అన్నారు. దీంతో గ్రామస్థులు విద్యుత్ శాఖ



అధికారుల నిర్లక్ష్యం లేగ మృతి చెందిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ లైన్ ఉండటంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను, విద్యుత్ లైన్‌ను పాఠశాల ప్రాంగణం నుంచి తొలగించి వేరే ప్రదేశానికి మార్చాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగితే దానికి బాధ్యులు ఎవరు అని గ్రామస్థులు అన్నారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రాంతానికి మార్చాలని డిమాండ్ చేశారు.

# చివరి గింజ వరకూ మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తాం

-వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతోనే కొనుగోలు

-ఇసుక రవాణా వాహనాలను ధాన్యం కొనుగోలుకు వినియోగించాలి

-డిఫాల్ట్ రైస్ మిల్లులు బకాయిలు చెల్లిస్తే ధాన్యం కేటాయింపు

-మే నెలాఖరులోగా యాసంగి కొనుగోళ్లు పూర్తి చేయాలి

-ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

పెద్దపల్లి, ప్రతినిధి మే 28 ( తెలంగాణ పత్రిక )




ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో చివరి గింజ వరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు.గురువారం పెద్దపల్లి ఐడిఓసీలో నిర్వహించిన యాసంగి ధాన్యం కొనుగోళ్ల సమీక్ష సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణా రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి లతో కలిసి పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ**

రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు గత ప్రభుత్వంతో పోలిస్తే 25 నుంచి 30 శాతం అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, 8 లక్షల మంది రైతులకు రూ.11 వేల కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు.15 నుంచి 17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు.వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ఎలాంటి కోతలు లేకుండా పూర్తి మద్దతు ధరతోనే కొనుగోలు చేసి బాయిలర్ మిల్లులకు తరలిస్తామని తెలిపారు. మిల్లర్లకు ఏవైనా నష్టాలు వచ్చినా ప్రభుత్వం భరిస్తుందని, రైతులకు మాత్రం నష్టం జరగనివ్వమన్నారు.రైతుల చివరి గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు.

గతంలో డిఫాల్ట్ అయిన రైస్ మిల్లులు బకాయిలు, వడ్డీలు చెల్లిస్తే తిరిగి ధాన్యం కేటాయింపులు ఇస్తామని తెలిపారు. రాబోయే 4 నుంచి 5 రోజుల పాటు ఇసుక రవాణా నిలిపివేసి వాహనాలను పూర్తిగా ధాన్యం రవాణాకు వినియోగించాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సుమారు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండగా, ఎఫ్‌సీఐ కేవలం 51 లక్షల మెట్రిక్ టన్నులకే పరిమితమైందన్నారు. ఎఫ్‌సీఐ కేటాయింపులకు మించి అదనంగా 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు.డిసెంబర్ 2023 తర్వాత కనీస మద్దతు ధర విధానాన్ని కచ్చితంగా అమలు చేస్తూ రైతులకు ఇప్పటివరకు అదనంగా రూ.16,479 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం వర్షాల కారణంగా కేవలం 9 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే తడిసిందని, ఆ ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.



**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ**

ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని తెలిపారు. అవసరమైతే అదనపు గోదాములు అద్దెకు తీసుకుంటామని చెప్పారు.కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఐదు సార్లు ధాన్యం కొనుగోళ్లు జరిగినప్పటికీ ఎక్కడా ఒక్క కిలో ధాన్యానికి కూడా తరుగు పేరుతో కోత విధించలేదన్నారు.జిల్లాలో ఎక్కడైనా రైతుల నుంచి ఒక్క కేజీ ధాన్యం తరుగు తీసినట్లు తెలిసినా కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా మిల్లర్ల చేత రైతులకు పరిహారం ఇప్పిస్తామని హెచ్చరించారు.

**ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ**

ఇతర జిల్లాల నుంచి కూడా పెద్దఎత్తున ధాన్యం పెద్దపల్లికి వస్తోందని, అందుకు అనుగుణంగా రైస్ కేటాయింపులు పెంచాలని కోరారు. రైతులను ఇబ్బంది పెట్టే మిల్లులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ**

జిల్లాలో యాసంగిలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు రూ.788 కోట్ల విలువైన 3.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. జూన్ 5 నాటికి 100 శాతం కొనుగోళ్లు పూర్తి చేస్తామని వెల్లడించారు.

ఆన్‌లైన్ ఎంట్రీలు, ట్రక్ షీట్ జనరేషన్, రైతుల చెల్లింపుల్లో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. జిల్లాలో 6.9 లక్షల మెట్రిక్ టన్నుల మిల్లింగ్ సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 5.7 లక్షల మెట్రిక్ టన్నులు వినియోగంలో ఉన్నాయని, ఇంకా 1.2 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం అందుబాటులో ఉందన్నారు.

మొక్కజొన్న కొనుగోళ్లు కూడా సమర్థవంతంగా కొనసాగుతున్నాయని, ఇప్పటివరకు 22 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసి అవసరమైన నిల్వ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ**

యాసంగి సీజన్ లో లక్షా 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 185 కోనుగోలు కేంద్రాల ద్వారా 65 వేలు మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. భూపాలపల్లి జిల్లాకు సంబంధించి పెద్ద పల్లిలో 20 వేల వరంగల్ లో 20 వేల మెట్రిక్ టన్నుల, హన్మకొండ లో 10 వేల మెట్రిక్ టన్నులు మిల్లింగ్ కొరకు పౌరసరఫరాల శాఖ అలాట్మెంట్ చేసిందని తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో హార్వెస్టింగ్ కొన్ని ప్రాంతాలలో ఆలస్యంగా జరుగుతుందని, చాలా మండలాలో ఇంకా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావాల్సి ఉందన్నారు.మంత్రి ఆదేశాల మేరకు 100 మట్టి, ఇసుక రవాణా వాహనాలను కూడా ధాన్యం కొనుగోళ్ల కోసం వినియోగిస్తున్నట్లు తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో స్టోరేజీ ప్లేస్ తక్కువగా ఉన్నందున ఇతర జిల్లాల మిల్లులకు కూడా ట్యాగ్ చేయాలని కోరారు. అంతకుముందు పెద్ద కలవల్ల ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి గంగయ్య సురేష్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్ జిల్లా సహకార అధికారి శ్రీమాల, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిని కాళిందిని జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి సంబంధిత అధికారులు రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు

# చేగుంట లో ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు





చేగుంట మే 28 ( తెలంగాణ పత్రిక)

బక్రీద్ పండుగ సందర్భంగా చేగుంట మండల ముస్లిం సోదరులు ఉదయాన్నే మసీదు దగ్గర అందరూ కలుసుకొని ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక నమాజ్ ప్రార్థనలు చేశారు.అనంతరం ఒకరికొకరు ఆలాయి బలాయ్ తీసుకొని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు అనంతరం మస్జీద్ ఈమమ్ అన్వేర్ ఉల్ హాక్ మాట్లాడుతూ.బక్రీద్ పర్వదినం సందర్భంగా ఈద్గా దగ్గర బక్రీద్ వేడుకలు ఘనంగా జరుపుకున్నట్టు తెలిపారు.త్యాగం భక్తి విశ్వాసానికి ప్రతీకగా బక్రీద్ పండుగను జరుపుకోవడం జరుగుతుందని అన్నారు.ప్రతి సంవత్సరం రంజాన్ పండగ ముగిసిన తర్వాత బక్రీద్ పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు.ఆ అల్లా దీవెనెలతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని వేడుకున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమం లో మస్జీద్ ఈమమ్ అన్వార్ ఉల్ హాక్, మస్జీద్ కమిటీ ఉపాధ్యక్షులు రహీమోద్దీన్, వార్డ్ సభ్యులు అరిఫ్, టీంక సెట్,తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన వరి ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం

ధాన్యం కొనుగోళ్లలో జాప్యానికి తావులేకుండా చూడాలి

ఓపీఎంఎస్ నమోదు, ట్రక్ షీట్లు, లోడింగ్, అన్లోడింగ్ పై ఆరా

మిల్లుల వద్ద లారీలు ఆగకుండా తగు చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్

మే28 నాగర్ కర్నూల్ :

రైతులు పండించిన ప్రతి గింజకు సరైన ధర దక్కేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అన్నారు.

రైతులు ధాన్యం అమ్మకానికి వచ్చినప్పుడు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తేమ కారణంగా తడిసిన వరి, మొక్కజొన్న ధాన్యాన్ని కూడా రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. గురువారం అచ్చంపేట మండలం పరిధిలోని చెన్నారం గ్రామంలోని లలిత ఉమామహేశ్వర కాటన్ జిన్నింగ్ మిల్‌తో పాటు నడింపల్లి గ్రామంలోని వెంకటేశ్వర కాటన్ మిల్లులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. మిల్లులలో నిల్వ ఉంచిన వరి, మొక్కజొన్న ధాన్యాం బస్తాల నిలువలను పరిశీలించి నిల్వ సామర్థ్యం, కొనుగోలు ప్రక్రియ, మిల్లింగ్ వ్యవస్థపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మిల్లులలో రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎలా నిల్వ చేస్తున్నారో, గిడ్డంగుల సామర్థ్యం ఎంత ఉందో, నాణ్యత పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధాన్యం నిల్వలో నిర్లక్ష్యం వహిస్తే నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందని, కాబట్టి వర్షాల నేపథ్యంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరి, మొక్కజొన్న ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, కవర్లు ఏర్పాటు చేయాలని, నిల్వ గిడ్డంగులు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. హమాలీల సంఖ్య, అందుబాటులో ఉన్న హమాలీలు ఎంత మంది? అనే వివరాలు తెలుసుకొని, అవసరమైతే అదనపు హమాలీలను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా తూకం ప్రక్రియ, రవాణా ఏర్పాట్లు వేగవంతం చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు అనంతరం వెంటనే మిల్లింగ్ ప్రక్రియకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను సక్రమంగా పరిశీలించి పారదర్శకంగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా ప్రతి దశలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు, రవాణా, చెల్లింపుల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులపై రైతుల అభిప్రాయాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులు కూడా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. అధికారులు రైతుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించి కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎక్కడా రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్ పండగ ఎమ్మెల్యే బిఎల్ఆర్

-ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన.. ఎమ్మెల్యే బిఎల్ఆర్

మిర్యాలగూడ ప్రతినిధి//మే 28:(తెలంగాణ పత్రిక):-

త్యాగానికి, భక్తికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను పురస్కరించుకుని గురువారం మిర్యాలగూడ పట్టణంలోని ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు నిర్వహించిన ప్రత్యేక నమాజ్ ప్రార్థనలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని అందరికీ పండుగ శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ త్యాగం సేవాభావం మానవత్వానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ మానవాళికి దైవభక్తిని, సోదరభావాన్ని



చాటిచెబుతుంది అని అన్నారు. సమాజంలో అందరూ శాంతిసౌఖ్యాలతో కుల మత తేడా లేకుండా కలిసిమెలిసి జీవించాలని ఈ పండుగ ఇచ్చే గొప్ప సందేశం అని అన్నారు. అల్లాహ్ కరుణాకటాక్షాలతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, ప్రత్యేకంగా ప్రార్థించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. మైనారిటీల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని అన్నారు. ఈ ప్రార్థనల అనంతరం ముస్లిం మత పెద్దలు, సోదరులు ఎమ్మెల్యే ని ఆలింగనం చేసుకుని పండుగ శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ముస్లిం ప్రముఖులు, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు, తదితరులు పాల్గొన్నారు..

# రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ కు శుభాకాంక్షలు తెలిపిన డి.ఎస్.పి

గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే 28

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన రాష్ట్ర వక్ఫ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్ గురువారం రోజున బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని గంభీరావుపేటకు రాగ తనను డీఎస్పీ నాగేంద్ర చారి కలసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు అజ్మతుల్లా హుస్సేన్ మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు బాగుండాలని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.



# భక్తి శ్రద్ధల మధ్య బక్రీద్

## -సామూహిక ప్రార్థనలు జరిపిన ముస్లింలు



(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):
త్యాగానికి, మానవత్వానికి ప్రతీక 'బక్రీద్'.ఈదుల్ అజ్హా ను పురస్కరించుకొని ఈద్గాలవద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.ప్రార్థనల అనంతరం ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకొని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈద్గాల వద్ద మున్సిపల్ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే పండుగలలో 'ఈదుల్ అజ్హా' అత్యంత ముఖ్యమైనది. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం చివరి నెల అయిన 'జుల్ హిజ్జా' 10వ రోజున ఈ పండుగను జరుపుకుంటారు. సమాజంలో ద్వేషం, స్వార్థాన్ని వదిలిపెట్టి.. త్యాగం, సహనం, దానగుణం అలవర్చుకోవాలనే గొప్ప సందేశాన్ని ఈ పండుగ ఇస్తుంది.ఇస్లాం ధర్మం ప్రకారం.. సుమారు 4 వేల ఏళ్ల క్రితం దైవ ప్రవక్త అయిన హజరత్ ఇబ్రహీం అల్లాహ్ పట్ల తనకున్న భక్తిని నిరూపించుకోవడానికి సిద్ధపడిన సంఘటనే ఈ పండుగకు మూలం. ఎంతో కాలం తర్వాత వృద్ధాప్యంలో ఇబ్రహీం దంపతులకు ఇస్మాయిల్ అనే కుమారుడు జన్మిస్తాడు.

అయితే, ఒకరోజు ఇబ్రహీంకు తన ప్రాణ సమానమైన కుమారుడిని అల్లాహ్ మార్గంలో బలి ఇస్తున్నట్లు కల వస్తుంది. దేవుని ఆజ్ఞగా భావించి, ఇబ్రహీం తన కొడుకును బలి ఇవ్వడానికి ఏమాత్రం వెనుకాడడు. తండ్రి ఇష్టానికి కుమారుడు ఇస్మాయిల్ కూడా సంతోషంగా ఒప్పుకుంటాడు. ఇబ్రహీం తన కొడుకు మెడపై కత్తి పెట్టబోయే క్షణంలో.. వారి త్యాగ నిరతికి, విధేయతకు మెచ్చిన అల్లాహ్, ఇస్మాయిల్ స్థానంలో స్వర్గం నుండి ఒక పొట్టేలును ప్రత్యక్షం చేస్తాడు. కుమారుడి ప్రాణానికి బదులు ఆ మూగజీవాన్ని బలి ఇవ్వాలని ఆదేశిస్తాడు. అనాటి నుండి ఈ త్యాగాన్ని స్మరిస్తూ 'ఖుర్బానీ' ఇచ్చే సాంప్రదాయం ప్రారంభమైంది.

**'ఖుర్బానీ' అంతరార్థం మరియు సామాజిక స్పృహ.**

బక్రీద్ అంటే కేవలం జంతువులను బలి ఇవ్వడం మాత్రమే కాదు. మనిషి తనలోని అహంకారాన్ని, లోభత్వాన్ని , స్వార్థాన్ని దైవ చింతనతో త్యాగం చేయడమే దీని అసలైన ఉద్దేశం. ఖుర్బానీ ద్వారా వచ్చే మాంసాన్ని ఇస్లాం నియమాల ప్రకారం మూడు భాగాలుగా విభజిస్తారు.మొదటి భాగం పేద సాదలకు, ఆకలితో ఉన్నవారికి దానం చేస్తారు. రెండవ భాగం బంధుమిత్రులకు, స్నేహితులకు పంచుతారు. మూడవ భాగం తమ కుటుంబం కోసం ఉంచుకుంటారు. సమాజంలో ఎవరూ ఆకలితో అలమటించకూడదనే ఒక అద్భుతమైన సామాజిక సమానత్వ సూత్రం ఈ పంపకంలో దాగి ఉంది. ఇస్లాం ఐదు ముఖ్య సూత్రాలలో ఒకటైన 'హజ్ యాత్ర' కూడా ఈ బక్రీద్ సమయం లోనే జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు సౌదీ అరేబియాలోని పవిత్ర మక్కా నగరానికి చేరుకుని కాబా చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. శక్తి ఉండి, సంపాదన ఉన్న ప్రతి ముస్లిం తన జీవితకాలంలో ఒక్కసారైనా ఈ యాత్ర చేయాలని ఆకాంక్షిస్తారు.బక్రీద్ రోజున ఉదయాన్నే ముస్లింలు కొత్త బట్టలు ధరించి, ఈద్గాహ్‌లు మరియు మసీదులకు చేరుకుని సామూహిక ప్రత్యేక నమాజ్ ఆచరిస్తారు. అనంతరం ఒకరినొకరు కౌగిలించుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇళ్లలో పలు రకాల వంటకాలతో పాటు పాలు, డ్రై ఫ్రూట్స్‌తో చేసే 'షీర్ ఖుర్మా' తయారు చేసి అందరికీ తినిపిస్తారు. మరణించిన తమ పెద్దల సమాధులను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేయడం కూడా ఈ పండుగలో ఒక భాగం. మతం ఏదైనా మానవత్వమే మిన్న అని చాటిచెప్పేలా, కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి ఉండాలనే శాంతి సందేశాన్ని బక్రీద్ లోకానికి అందిస్తోందనీ మౌలానా వివరించారు.

# బక్రీద్ పర్వదినం సందర్భంగా ఈద్గాలో ప్రత్యేక నమాజ్‌లో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్

కామారెడ్డి ,మే 28, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)
పవిత్రమైన బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా) పర్వదినాన్ని పురస్కరించుకొని కామారెడ్డి పట్టణంలోని కోర్టు ఆవరణలో గల ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక నమాజ్ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పాల్గొన్నారు. అనంతరం అక్కడికి విచ్చేసిన ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రసంగించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఈద్-ఉల్-అజ్హా పండుగ విశ్వాసం, త్యాగం, కరుణ, మానవత్వం వంటి గొప్ప విలువలను సమాజానికి గుర్తు చేస్తుందని అన్నారు. ప్రతి ఇంటిలో శాంతి, సంతోషం, ఐశ్వర్యం, సౌభ్రాతృత్వం నిండాలని ఆకాంక్షించారు. సమాజ సేవ, ఐక్యత, సోదరభావం వంటి విలువలను ప్రతి ఒక్కరూ మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కుల గణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి అన్నారు బీజేపీ రాజ్యాంగ విరుద్ధమైన చర్యలపై ధ్వజం ఎత్తారు. గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలనే ప్రతిపాదనకు మద్దతు తెలిపారు. కుల గణన మరియు ఎస్.ఐ.ఆర్ పై దేశంలో జరుగుతున్న ప్రస్తుత పరిణామాలు, కుల గణన ప్రాధాన్యతపై వివరంగా మాట్లాడాతూ. రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణన (సెన్సస్) ప్రక్రియలో ప్రతి ఒక్కరూ ఎట్టి పరిస్థితుల్లోనూ తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. సమాజంలో అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే కుల గణన అత్యంత కీలకం. దీనిపై స్థానిక నాయకులు, ప్రభుత్వ అధికారులు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలిఅని





ఆయన ఆదేశించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై షబ్బీర్ అలీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బీజేపీ ప్రభుత్వం తమకు వ్యతిరేకంగా ఉన్న ఓట్లను అక్రమంగా తొలగిస్తూ దేశ మనుగడకే ప్రమాదం తెచ్చేలా, రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాష్ట్రాలపై ఒత్తిడి,బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలలో ఎలక్షన్ కమిషన్‌పై ఒత్తిడి తెచ్చి, 'ఎస్ ఐ ఆర్' పేరుతో లక్షలాది ప్రతిపక్ష ఓట్లను ఓటర్ల జాబితా నుండి తొలగిస్తున్నారని మండిపడ్డారు. ఇందుకు బెంగాల్, అస్సాం, బీహార్ రాష్ట్రాలే ఉదాహరణలు. పశ్చిమ బెంగాల్‌లో అధికారం దక్కించుకోవడం కోసం ఏకంగా 95 లక్షల ఓట్లను తొలగించారని, అలాగే బీహార్ రాష్ట్రంలోనూ ఇదే తరహాలో ఓట్లను తొలగించి అక్రమంగా ఎన్నికల్లో గెలిచారని ధ్వజమెత్తారు. ఇలాంటి రాజ్యాంగ విరుద్ధ చర్యలకు అవకాశం ఇవ్వకుండా ఉండేందుకు, ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండి, తమ వివరాలను అందిస్తూ ఓటు హక్కును తప్పకుండా నమోదు చేసుకోవాలని , రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గంగా-జమునా తహజీబ్ వర్ధిల్లాలి -- గోవుకు మద్దతు భారతదేశం ఎంతో కాలంగా 'గంగా-జమునాతహజీబ్' భిన్నత్వంలో ఏకత్వం అనే సాంప్రదాయంతో వర్ధిల్లుతోందని అయితే మతతత్వ బీజేపీ పార్టీ ప్రజల మధ్య విద్వేషాలు రేపి, సమాజాన్ని విడదీసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని విమర్శించారు. అలాగే, ఆవును దేశ జాతీయ జంతువుగా ప్రకటించాలని దేశ ముస్లిం మత పెద్దలు కోరగా, మహమ్మద్ అలీ షబ్బీర్ దానికి సంపూర్ణ సమర్థన తెలుపుతూ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ లౌకికత్వానికి కట్టుబడి ఉంటుందని స్పష్టం చేస్తూ, భారతీయులందరూ ఒకటే. కులమతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా దేశాభివృద్ధికి పాటుపడాలిఅని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, మత పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో టెక్స్టైల్ కోర్సులపై అవగాహన కార్యక్రమం

**-చేనేత కార్మికుల పిల్లలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: వేముల మార్కండేయులు**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 28, తెలంగాణ పత్రిక
రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట జ్యోతి నగర్ వార్డులోని మరమగ్గాల కార్ఖానాలో చేనేత జౌళి శాఖ కోఆర్డినేటర్ వేముల మార్కండేయులు ఆధ్వర్యంలో టెక్స్టైల్ కోర్సులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మరమగ్గాల కార్మికులు, ఆసాములు, చేనేత కార్మికుల తల్లిదండ్రులు మరియు విద్యార్థులకు ఐఐహెచ్‌టి టెక్స్టైల్ కోర్సులపై అవగాహన కల్పించారు.ఉదయం 10:30 గంటలకు విద్యార్థులను కలిసి కరపత్రాలు, అప్లికేషన్ ఫారాలు పంపిణీ చేశారు. అనంతరం వేముల మార్కండేయులు మాట్లాడుతూ.. టెక్స్టైల్ కోర్సుల వల్ల విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన




విద్యార్థులు ఈ కోర్సుకు అర్హులని పేర్కొన్నారు.జూన్ 2వ తేదీ వరకు మాత్రమే దరఖాస్తుల గడువు ఉండటంతో ఆసక్తి గల విద్యార్థులు వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. రాష్ట్ర స్థాయిలో కేవలం 60 సీట్లు మాత్రమే ఉన్నాయని, ఇప్పటికే సిరిసిల్ల నుంచి 31 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారని తెలిపారు.సిరిసిల్ల పవర్లూమ్ పరిశ్రమకు చెందిన విద్యార్థులు టెక్స్టైల్ రంగంలో ముందుకు వచ్చి తమ ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. చేనేత కార్మికుల పిల్లలు టెక్స్టైల్ ఇంజనీర్లుగా ఎదగడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2,500, కేంద్ర ప్రభుత్వం రూ.5,000 స్కాలర్షిప్ అందిస్తోందని తెలిపారు. టెక్స్టైల్ కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు."నరాలను పోగులుగా చేసి, రక్తాన్ని రంగుగా మార్చి, చెమట చుక్కలను చీరలుగా మార్చే చేనేత కార్మికుల పిల్లలు టెక్స్టైల్ రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలి" అని వేముల మార్కండేయులు పేర్కొన్నారు. చేనేత వారసత్వ సంపదను భవిష్యత్ తరాలకు అందించేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైన నేపథ్యంలో ఆసక్తి గల విద్యార్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాల కోసం "రైతుల-నేతన్నల మనోధైర్య హెల్ప్‌లైన్" నిర్వాహకుడు వేముల మార్కండేయులు సెల్ నంబర్ 9948394061ను సంప్రదించాలని సూచించారు.

# ఘనంగా ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలు

**-జనరల్ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవం**
**-ముఖ్య అతిథులుగా హాజరైన పోచారం కాసుల**

కోటగిరి తెలంగాణ పత్రిక మే 28.
కోటగిరి మండల కేంద్రంలోని మిర్జాపూర్ క్యాంప్ ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఎన్టీఆర్ అభిమానుల సంఘ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన నందమూరి తారక రామారావు జయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన పోచారం శ్రీనివాస్ రెడ్డి కాసుల బాలరాజ్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి 103వ. జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపం (జనరల్ ఫంక్షనల్) గదిని రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. తదనునంతరం పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..... రాష్ట్రంలో ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలను ఆనందబరితంగా కన్నుల పండుగగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. నేడు కోటగిరి మండల కేంద్రంలో మిర్జాపూర్ క్యాంప్ లో రెండు సంవత్సరాల క్రితం విగ్రహాన్ని ఆవిష్కరించడం జరిగిందన్నారు. నేడు 103వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి ఉత్సవాలను జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. జనరల్ ఫంక్షన్ హాల్ ప్రధాన రహదారి పక్కన కళ్యాణ మండపం నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించడం పట్ల మిక్కిలినేని ప్రసాద్ రావు కుటుంబ సభ్యులకు ఈ కళ్యాణ మండపం ప్రారంభోత్సవం సందర్భంగా శు





భాకాంక్షలు తెలిపారు. తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెడుతున్నారని భావించి,1982 టిడిపి పార్టీని స్థాపించారని తెలిపారు. పరిపాలనను కష్ట కష్టాలను పెడుతున్నారని తెలుసుకొని నందమూరి తారక రామారావు పార్టీని స్థాపించడం జరిగిందన్నారు. పార్టీ స్థాపించి తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత తారక రామారావుది అని కొనియాడారు. సంక్షేమ పథకాలు రాష్ట్రంలో ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీఆర్ కే దక్కిందన్నారు. రాష్ట్రంలోని బాన్సువాడ నియోజకవర్గం అన్ని రంగాల్లో వ్యవసాయ రంగంలో విద్య వైద్య సంక్షేమ పథకాలలో నంబర్ వన్ గా నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్ ఏఎంసి చైర్మన్ గైక్వాడ్ హనుమంతు వైస్ చైర్మన్ కులకర్ణి అనిల్ జనరల్ ఫంక్షన్ హాల్ స్థలదాత మిక్కిలినేని ప్రసాద్ రావు కుటుంబ సభ్యులు శ్రీమతి రాజ్యలక్ష్మి, బంజారా సంఘ అధ్యక్షులు బాధ్యనాయక్ ముమ్మలనేనీ రాజశేఖర్ దంపతులు టిడిపి సీనియర్ నాయకులు అమర్నాథ్ బాబు వేములపల్లి కృష్ణారావు మాజీ జెడ్పిటిసిలు పప్పాల శంకర్, శంకర్ పటేల్, మాజీ ఎంపీపీ పవన్ బోధన్ కమ్మ సంఘం అధ్యక్షులు శివ నారాయణ జనరల్ ఫంక్షనల్ అధ్యక్షులు దుప్పలపూడి శ్రీధర్ క్యాషియర్ ఉదయ్ భాస్కర్ రామాలయ కమిటీ చైర్మన్ దమ్మాలపాటి చౌదరి ఎన్టీఆర్ అభిమాన సంఘ సభ్యులు కొల్లూరు రమేష్ బాబు ఆనంద్ నార్ల సాయి శ్రీనివాస్ పత్తి లక్ష్మణ్ శ్యామ్ ఎన్టీఆర్ మహిళా సంఘ సభ్యులు పార్వతీ సుజాత వెంకటరమణమ్మ రూప బాజీ లక్ష్మీ రమ ఉమ్మడి మండలాల వివిధ గ్రామాల సర్పంచులు మాజీ ఎంపీటీసీలు బాన్సువాడ నియోజకవర్గ నాయకులు కోటగిరి పోతంగల్ ఉమ్మడి మండలాల ఎన్టీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి గౌరవించాలి

మిర్యాలగూడ ప్రతినిధి//మే 28:(తెలంగాణ పత్రిక):-

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులందరినీ గౌరవించి సన్మానించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలంగాణ తొలి దశ, మలిదశ ఉద్యమకారుడు జేఏసీ నాయకులు ప్రముఖ వైద్యులు డాక్టర్ జాడి రాజు అన్నారు. గురువారం స్థానిక బీసీ భవన్ లో జరిగిన ఉద్యమకారుల సమావేశానికి జేఏసీ నాయకులు, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నేత మాలోత్ దశరథ్ నాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజు మాట్లాడుతూ సబ్బండ వర్గాల సామూహిక ఉద్యమాలతోనే తెలంగాణ సాధించబడిందన్నారు. అన్ని వర్గాల ప్రజలు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని ఆంధ్ర పాలక పక్షాన్ని దిక్కరించారని పేర్కొన్నారు..ఉద్యమం మరింత ఉధృతం కావడంతో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాడు తెలంగాణను ప్రకటించిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రధాన



భూమిక పోషించిన నాయకులను గుర్తించి గౌరవించి సన్మానించుకుంటే ఉద్యమకారులు ఆనందపడతారన్నారు. ఇప్పటివరకు ఉద్యమకారులను సన్మానించిన వారు ఎవరూ లేరని తెలంగాణ ఉద్యమకారు ఫోరం ఆధ్వర్యంలో జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు సన్మానించాలని నిర్ణయించడం అభినందనీయమని అన్నారు. నిజమైన నికర్సైన ఉద్యమకారులను గుర్తించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు తాళ్లపల్లి రవి, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మాడుగుల శ్రీనివాస్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి దిరావత్ లింగ నాయక్, టీజేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు క్రాంతి కుమార్, నాయక్, బీసీ సంఘం పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు, యాదవ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి చేగోండి మురళి యాదవ్, బీసీ జేఏసీ కోకన్వీనర్ దాసరాజు జయరాజు, ఆర్టీసీ జేఏసీ నాయకులు ఇక్బాల్, జేఏసీ నాయకులు కొండారపు నాగేశ్వరరావు, నీలకంఠ నాయక్, కళాకారుడు కిరణ్, కోల సైదులు,నాయుడు, 1969 ఉద్యమ నాయకులు చీదర్ల సత్యనారాయణ,కిష్టయ్య, లింగయ్య, గంధం సైదులు, చిలుకూరి శ్యామ్, షోయబ్, నాగరాజు, మధుసూదన్, రాజ్ కుమార్ సినీ టీవీ నటుడు ఎంవిఆర్ రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బ్రేకియల్ ప్లెక్సస్ సర్జరీ ద్వారా నరాల కదలిక తేవచ్చు

-యశోద సిటీ హాస్పిటల్ వైద్యుడు ప్రకాష్

కామారెడ్డి, మే 28, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి యశోద హాస్పిటల్స్‌లో అధునాతన 'బ్రేకియల్ ప్లెక్సస్ సర్జరీ' ద్వారా దెబ్బతిన్న నరాలను సర్జరీ చేసి, అవయవాలకు తిరిగి కదలికలు తీసుకొచ్చే అవకాశం ఉందని ఆస్పత్రి హైటెక్ సిటీ వైద్యుడు ప్రకాష్ తెలిపారు. గురువారం కామారెడ్డి పట్టణంలోని యశోద బ్రాంచ్ క్లినిక్లో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. బ్రేకియల్ ప్లెక్సస్ ఇంజురీ అంటే చేతి నాడుల మీద తీవ్రమైన గాయమని వైద్యుడు ప్రకాశ్ తెలిపారు. ముఖ్యంగా బైక్ల నుంచి పడిపోయినప్పుడు ఈ గాయాలు ఎక్కువగా నమోదవుతున్నాయని తెలిపారు. ఇలా




చేతి నరాలు దెబ్బతినడం వల్ల బ్రేకియల్ ప్లెక్సస్ ఏర్పడుతుందని, ఇది చేతి నరాలకు సంబంధించిన తీవ్రమైన సమస్య అని, సకాలంలో సర్జరీ చేయించుకుంటే చేతికి కదలికలు, స్పర్శ తిరిగి వస్తుందన్నారు. చేతిలో కండరాలు బండబారిపోవడం, చేతిలో స్పర్శ లేకపోవడం, కండరాలు పనిచేయకపోవడం, చేయిని పైకి ఎత్తలేకపోవడం లాంటివి జరుగుతుం టాయన్నారు. అలాగే భుజం ఎత్తలేకపోవడం, మోచేయి వంచలేకపోవడం, అరచేతి మూయలేకపోవడం, పూర్తిగా భుజం నుంచి చేతి వరకు నొప్పి రావడం లాంటివి లక్షణాలని, ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే నిపుణులైన డాక్టర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఏదైనా సందేహం ఉంటే యశోద హాస్పిటల్స్‌ను సంప్రదించవచ్చునని తెలిపారు.

# అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించిన జిల్లా యంత్రాంగం

-జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ చొరవతో వేగవంతమైన చర్యలు

కామారెడ్డి, మే 28, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లాలో ఈ నెల 27వ తేదీ తెల్లవారుజామున కురిసిన అకాల వర్షాల కారణంగా రామారెడ్డి, దోమకొండ, సదాశివనగర్ , మాచారెడ్డి మండలాల పరిధిలోని కొన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పాక్షికంగా, పూర్తిగా తడిసిన ధాన్యం నిల్వలు నమోదయ్యాయి. సుమారు 1,064 మెట్రిక్ టన్నుల ధాన్యం వర్ష ప్రభావానికి గురైన సందర్భంగా అధికారులు జిల్లా కలెక్టర్ పరిస్థితిని సమీక్షించి సంబంధిత శాఖల అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో తహసీల్దార్లు, సివిల్ సప్లైస్ అధికారులు, డి ఆర్ డి ఓలు, డి సి ఓలు, పిసిసి ఇన్‌చార్జ్‌లు , ఫీల్డ్ స్థాయి సిబ్బంది వెంటనే కొనుగోలు కేంద్రాలకు చేరుకుని చర్యలు చేపట్టారు. ప్రభావితమైన 1,064 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సమీపంలోని పార్బాయిల్డ్ రైస్ మిల్లులకు



తరలించి భద్రపరిచారు. ధాన్యం మరింత దెబ్బతినకుండా ఉండేందుకు రవాణా, అన్‌లోడింగ్ , నిరంతర పర్యవేక్షణ ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన నిర్వహించారు . జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగం స్పందించి తీసుకున్న చర్యలపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. వాతావరణ హెచ్చరికలు మరిన్ని వర్షాల అవకాశాల దృష్ట్యా అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 3,82,760 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, దాని విలువ రూ. 914.41 కోట్లుగా నమోదైంది. ఇందులో 3,27,996 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి రూ. 783.57 కోట్ల చెల్లింపులు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని మొత్తం చెల్లింపుల శాతం 86 శాతానికి చేరుకుందన్నారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణకు, అలాగే అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు, రవాణా చెల్లింపుల ప్రక్రియలను సజావుగా కొనసాగించేందుకు జిల్లా యంత్రాంగం అహర్నిశలు పర్యవేక్షిస్తున్నదని కలెక్టర్ తెలిపార.

# ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న మారబోయిన రవి యాదవ్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు




రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి నియోజకవర్గం, మే 28,(తెలంగాణ పత్రిక)

బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ప్రజల సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండే యువ నాయకుడు మారబోయిన రవి యాదవ్ జన్మదిన వేడుకలు పాపిరెడ్డి కాలనీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్నేహితులు, పాత్రికేయులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్దకు చేరుకున్న పాత్రికేయ సోదరులు రవి యాదవ్‌ను కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. జర్నలిస్ట్ రాజా రవి, సురభి వెంకటేశ్వరరావు, బోయపాటి రాజేష్, అబ్బగోని అనిల్ బాబు, పల్లపు యాదయ్య, మల్లాని అశోక్, లచ్చగొని, శ్రీకాంత్ కుర్మా, కొత్తపల్లి రామకృష్ణ, కే శ్రీనివాస్, మల్లేష్, పరమేష్, తదితరులు పాల్గొని ఆయన సేవా



కార్యక్రమాలను కొనియాడారు. సామాన్య ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ, యువతకు ప్రేరణగా నిలుస్తున్న మారబోయిన రవి యాదవ్ సేవాభావం అభినందనీయమని వారు పేర్కొన్నారు. రాజకీయ నాయకత్వం అంటే కేవలం పదవులు కాదు, ప్రజల కోసం అంకితభావంతో పనిచేయడమేనని ఆయన తన సేవల ద్వారా నిరూపిస్తున్నారని కొనియాడారు. పేద ప్రజలకు అండగా నిలుస్తూ, యువత అభివృద్ధికి కృషి చేస్తూ, సమాజంలో మంచి మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న రవి యాదవ్ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయన ఆయురారోగ్యాలతో, విజయాలతో నిండిన జీవితాన్ని గడపాలని అభిమానులు, మిత్రులు మనస్ఫూర్తిగా కోరుకున్నారు. జన్మదిన వేడుకల సందర్భంగా హాల్ అంతా హర్షధ్వానాలు, శుభాకాంక్షలతో మార్మోగిపోగా, అభిమానుల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నాయకత్వం, సేవాభావం, మానవత్వం కలగలిసిన వ్యక్తిత్వంగా మారబోయిన రవి యాదవ్ ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని పలువురు అభిప్రాయపడ్డారు..

# ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

-రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ, కర్మాగార,గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకా నంద



(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):

ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా రైతుల వద్ద నుండి ఆఖరి గింజ వరకు వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ,కర్మాగార, గనులు,భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు.గురువారం జిల్లాలోని చెన్నూర్ మండలంషఔవురావుపేట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.సి.ప్రతినిధి రఘునాథ్ రెడ్డి, అధికారులతో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ...ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపడుతుందని,ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు.ప్రతి సంవత్సరం ఎకరానికి 25 క్వింటాళ్ల ధాన్యం వచ్చేదని,ఈసారి 28 నుండి 32 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని తెలిపారు. చెన్నూర్, కోటపల్లి ప్రాంతాలలో పంట ఆలస్యంగా వస్తున్నందున జూన్ 15వ తేదీ వరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. 2022-23 లో 1 లక్ష 13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఈసారి ఇప్పటివరకు 1 లక్ష 27 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, జూన్ 6వ తేదీ వరకు 30 వేల నుండి 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, మొత్తంగా దాదాపు 1 లక్ష 60 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉందని తెలిపారు.హమాలీల సమస్యను అధిగమించేందుకు స్థానికంగా హమాలీలను తీసుకొని ధాన్యం ఎగుమతి, దిగుమతులను వేగవంతం చేయడం జరిగిందని తెలిపారు. లారీలు సమకూర్చడం కొరకు సింగరేణి సంస్థతో మాట్లాడడం జరిగిందని, ఇసుక లారీలనుషఔన్యం రవాణాకు మళ్ళించడం జరిగిందని తెలిపారు. కొందరు ఉద్దేశపూర్వకంగా రైతులను ఆందోళన చేపట్టే దిశగా రెచ్చగొడుతున్నారని, పార్టీలకు అతీతంగా రైతుల సంక్షేమం కోసం కలిసి రావాలని తెలిపారు.చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని,రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని,అర్హులైన లబ్ధిదారులకు అందించే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...చెన్నూర్ మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని, జైపూర్ మండలంలో వచ్చే 3 రోజులలో ధాన్యం ప్రక్రియ పూర్తిషఔయడం జరుగుతుందని తెలిపారు.పెద్దపల్లి, కరీంనగర్ లలో హమాలీలతో కలిపి 2 గోదాములను ఇచ్చారని, అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలగకుండా ధాన్యం నిల్వ చేయడం జరుగుతుందని తెలిపారు.జిల్లాలోని జైపూర్ మండలంలో గల సుముఖ గోదాములోనికి చెన్నూర్ నుండి వచ్చే ధాన్యాన్ని అనుమతించడం జరుగుతుందని తెలిపారు.చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు 70 శాతం ధాన్యం ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, చెన్నూర్,కోటపల్లి మండలాలకు సంబంధించి ధాన్యం ప్రక్రియను 15 రోజులలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వచ్చే నెల 7వ తేదీ నుండి వర్షాలు వచ్చే అవకాశం ఉందని, ఈలోగా ధాన్యం కొనుగోలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దాదాపు 10 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ చెన్నూరు మండల కేంద్రంలో కొనసాగుతున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణలోకి నైరుతి రుతుపవనాల రాక ఎప్పుడు..? క్లారిటీ ఇచ్చిన IMD



తెలంగాణ పత్రిక ప్రతినిధి

తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు ఒకట్రెండు రోజుల్లో ప్రవేశించనున్నాయంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం స్పష్టంచేసింది. ఈ సమాచారాన్ని తాము ధృవీకరించలేదని స్పష్టం చేసింది. భారత వాతావరణ శాఖ (IMD) ఇంకా కేరళలో రుతుపవనాల అధికారిక ప్రవేశాన్ని ప్రకటించలేదని పేర్కొందినైరుతి రుతుపవనాలు రాకపై హైదరాబాద్ వాతావరణ కేంద్రం క్లారిటీ ఇచ్చింది. రాబోయే ఒకటి రెండు రోజుల్లో నైరుతి రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉందని కొన్ని మీడియా వర్గాల్లో వచ్చిన సమాచారాన్ని వాతావరణ కేంద్రం తోసిపుచ్చింది. నైరుతి రుతుపవనాల రాకకు సంబంధించి ఈ సమాచారాన్ని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ధృవీకరించలేదని స్పష్టంచేసింది. ఈ వార్తలు కేవలం పుకార్లని, పూర్తిగా అవాస్తవమని, తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయని స్పష్టంచేసింది.భారత వాతావరణ శాఖ (IMD) ఇంకా కేరళలో రుతుపవనాల అధికారిక రాక (Onset) తేదీని ప్రకటించలేదని గుర్తుచేసింది. సాధారణంగా, కేరళలో రుతుపవనాలు ప్రవేశించిన తర్వాత అవి తెలంగాణకు చేరుకోవడానికి సుమారు 5 నుండి 7 రోజుల సమయం పడుతుందని తెలిపిందితెలంగాణలోకి రుతుపవనాల తక్షణ రాకపై ఐఎమ్‌డీ (IMD) హైదరాబాద్ ఎటువంటి ప్రకటన విడుదల చేయలేదని స్పష్టంచేసింది. ఖచ్చితమైన, తాజా వాతావరణ సమాచారం కోసం మీడియా సంస్థలు, ప్రజలు ఐఎండీ అధికారిక వెబ్‌సైట్‌తో పాటు ఐఎండీ ధృవీకరించబడిన బులెటిన్‌లను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం గురువారం రాత్రి ఓ అధికారిక ప్రకటన విడుదలచేసింది.

# ప్రపంచంలో ఎక్కువ నీటిని వినియోగించే దేశం ఏదో తెలుసా?

తెలంగాణ పత్రిక ప్రతినిధి

**ఒక్కో వ్యక్తి ఎన్ని లీటర్లు వాడుతారంటే?**

సాధారణంగా మనం మన అవసరాల కోసం ఒక రోజు మొత్తంలో ఎంత నీటిని వాడుతాం 30-40 లీటర్లు ఉండొచ్చు. కానీ ఇక్కడో దేశంలో మాత్రం సగటున ఓ వ్యక్త దాదాపు 15వేలకుపైగా లీటర్ల నీటిని వినియోగిస్తారట. దీంతో ప్రపంచంలో సగటున ఒక వ్యక్తి ఏకంగా 15,445 లీటర్ల నీటిని ప్రతిరోజూ వాడే దేశంగా తుర్క్మెనిస్తాన్ మొదటి స్థానంలో నిలిచింది. నీటి వినియోగంపై ప్రపంచవ్యాప్తంగా జరిగిన తాజా అధ్యయనంలో ఈ దిగ్భ్రాంతికరమైన విషయం వెలుగులోకి వచ్చింది సాధారణంగా గృహ అవసరాల కోసం మనం వాడే నీటి పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది. కానీ తుర్క్మెనిస్తాన్ లో ఇంత భారీ స్థాయిలో నీటిని వినియోగించడానికి ప్రధాన కారణం అక్కడి వ్యవసాయ రంగమే. ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న మంచి నీటిలో డెబ్బై శాతం కేవలం వ్యవసాయం కోసమే ఖర్చు అవుతోంది. మధ్య ఆసియా ఖండంలోని దేశాల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉండి వ్యవసాయానికి అధిక నీరు పడుతోంది. వరల్డోమీటర్, ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలు సంయుక్తంగా విడుదల చేసిన తాజా నివేదిక ఈ సంచలన వివరాలను స్పష్టం చేసింది. దీని ప్రకారం ఒక వ్యక్తికి సగటున ఏడాదికి లక్షా ఇరవై ఎనిమిది వేల క్యూబిక్ అడుగుల మంచి నీటిని తుర్క్మెనిస్తాన్ దేశం ఉపయోగిస్తోంది. ఈ భారీ నీటి వినియోగం జాబితాలో రెండో స్థానంలో మోంటెనెగ్రో దేశం నిలవగా ఆ తర్వాతి స్థానాల్లో ఉజ్బెకిస్తాన్, గయానా దేశాలు ఉన్నాయి. అత్యంత అభివృద్ధి చెందిన దేశమైన అమెరికా కూడా ఈ జాబితాలో మొదటి ఐదు స్థానాల్లో ఉండటం తీవ్ర ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది తుర్క్మెనిస్తాన్ ప్రధానంగా చాలా పొడి వాతావరణం కలిగిన ఎడారి దేశం. అక్కడ రైతులు పత్తి పంటను అత్యధికంగా పండిస్తారు కాబట్టి నీటి అవసరం చాలా ఎక్కువగా ఉంటుంది. ఆ పంటకు అవసరమైన నీటి కోసం దశాబ్దాల క్రితమే భారీ నీటిపారుదల ప్రాజెక్టులను నిర్మించారు. సోవియట్ పాలన కాలంలో అము దర్యా నది నుంచి తవ్విన కాలువల ద్వారా వ్యవసాయ భూములకు నీటిని భారీగా మళ్లించారు. దీని వల్లే ఆ దేశంలో ప్రతి మనిషి పేరు మీద నమోదయ్యే సగటు నీటి వినియోగం ఆకాశాన్ని తాకింది ఈ రకమైన భారీ నీటి వినియోగం పర్యావరణం మీద ఊహించని స్థాయిలో తీవ్రమైన ప్రభావాన్ని చూపుతోంది. పంటల కోసం విపరీతంగా నీటిని మళ్లించడం వల్ల ఆ ప్రాంతంలోని అతిపెద్ద సరస్సులలో ఒకటైన అరల్ సముద్రం ప్రమాదకర స్థాయిలో పూర్తిగా ఎండిపోయింది. సరైన నిర్వహణ లేని పాత నీటి పారుదల వ్యవస్థల వల్ల నీరు పొలాలకు చేరక ముందే మార్గమధ్యంలోనే పెద్ద ఎత్తున వృథా అవుతోంది. సెంట్రల్ ఆసియాలోని కిర్గిజిస్తాన్, తజికిస్తాన్ లాంటి దేశాలు కూడా సరిగ్గా ఇలాంటి నీటి వృథా సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నాయి. వ్యవసాయం మాత్రమే కాకుండా విద్యుత్ ఉత్పత్తి, పరిశ్రమల అవసరాల కోసం కూడా అగ్ర దేశాలు పెద్ద ఎత్తున నీటిని వాడుతున్నాయి. తక్కువ జనాభా ఉండి అధిక పారిశ్రామిక లేదా సాగు నీటి అవసరాలు ఉన్నప్పుడు తలసరి నీటి వినియోగం అమాంతం పెరిగిపోతుంది. దీనివల్ల భవిష్యత్తులో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయి తీవ్రమైన తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ఆఫ్రికా దేశాలైన కాంగో లాంటి చోట్ల తలసరి నీటి వాడకం కేవలం ముప్పై రెండు లీటర్లు మాత్రమే ఉండటం గమనార్హం. రోజురోజుకూ పెరుగుతున్న నీటి కొరత భవిష్యత్తులో ప్రపంచ దేశాల ఉనికిని తీవ్రంగా కలవరపెట్టే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే వ్యవసాయంలో నీటి ఆదా కోసం నూతన సాంకేతిక విధానాలను, బిందు సేద్యం పద్ధతులను వెంటనే వాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రాజెక్టుల నుంచి నీరు లీకవుతూ వృథా కాకుండా ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు కాలువలను పర్యవేక్షించి మరమ్మతులు చేయాలి. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వాడుకుంటేనే రాబోయే తరాలకు మనం తగినంత ప్రాణాధారమైన నీటిని సురక్షితంగా అందించగలం. లేకపోతే ప్రపంచం మొత్తం ఒక భయంకరమైన నీటి సంక్షోభాన్ని ఎదుర్కోవడం మాత్రం కచ్చితం.

# ప్రతి పౌరుడికి సమగ్ర సంక్షేమ కార్డు.. సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

తెలంగాణ పత్రిక ప్రతినిధి



తెలంగాణలో ప్రతి పౌరుడు పొందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను ఒకే చోట అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం 'సమగ్ర సంక్షేమ కార్డు' (యూనిఫైడ్ కార్డ్) తీసుకురానుంది. ఈ కార్డు ద్వారా లబ్ధిదారుడు ఏ శాఖ నుంచి, ఏ పథకం కింద, ఎంత మేర ప్రయోజనం పొందుతున్నాడో పూర్తి సమాచారం తెలుసుకునే అవకాశం ఉంటుంది. అన్ని శాఖల లబ్ధిదారుల డేటాను సమీకరించి పారదర్శకంగా సంక్షేమ సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కార్డు అమల్లోకి వస్తే సంక్షేమ పథకాల నిర్వహణ మరింత సమర్థవంతంగా మారే అవకాశం ఉంటుందన్నారుహైదరాబాద్ (28 మే, 2026): తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో ఉండేలా సమగ్ర సంక్షేమ కార్డును (యూనిఫైడ్ కార్డ్ ) రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ కార్డ్ ద్వారా స్పష్టంగా తెలిసేలా ఉండాలని సూచించారు. తక్షణమే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్ రామకృష్ణారావు, సీఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితర ఉన్నతాధికారుల సమీక్షలో సీఎం ఈ విషయాన్ని ప్రత్యేకంగా చర్చించా సమగ్ర సంక్షేమ కార్డ్ ద్వారా రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకేచోట అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ డేటాను అన్ని కోణాల్లో ఏఐ సహాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందన్నారు. నిజమైన అర్హులకు పథకాలు మరింత ఖచ్చితంగా చేరుతాయన్నారు. అదే సమయంలో అనర్హులను గుర్తించడం సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు ఇచ్చే పద్ధతికి బదులు, ఐటీ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సంక్షేమ కార్డ్ ఉండాలని సీఎం సూచించారు. టెక్నాలజీపై పట్టున్న, చురుగ్గా పనిచేసే యువ ప్రభుత్వ అధికారులను ఈ ప్రక్రియకు వినియోగించాలని చెప్పారు. ఈ కార్డ్‌లో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, ఇన్సూరెన్స్ పథకాలు, ప్రభుత్వం తీసుకువస్తున్న బీమా పథకాల వివరాలు ఉండాలని చెప్పారు. అవసరమైతే ఆధార్ నంబర్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చేలా ఆలోచించాలన్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను కూడా ఈ కార్డ్‌కు అనుసంధానించాలన్నారు

# మే,జూన్లో దొరికే చింత చిగురును మిస్ చేసుకోకండి..

తెలంగాణ పత్రిక స్పెషల్ స్టోరీ

**దాని వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో తెలుసుకుందాం:-**



చింత చచ్చినా పులుపు చావలేదు.. అన్న సామెతను మీరు వినే ఉంటారు. ఆయా సందర్భాల్లో దీన్ని మనం పోలిక కోసం ఉపయోగిస్తుంటాం. అయితే పులుపు సంగతి ఎలా ఉన్నా చింతను తీసుకోవడం వల్ల మనకు ఆరోగ్యకర ప్రయోజనాలే కలుగుతాయి. ప్ర ధానంగా ఈ కాలంలో విరివిగా లభ్యమయ్యే చింత చిగురుతో ఎన్నో లాభాలు ఉన్నాయి. రుచికరమైన ఆహారంగానే కాక దీన్ని తినడం వల్ల మనకు ఆరోగ్యం కూడా కలుగుతుంది. ఈ క్ర మంలో చింత చిగురును నిత్యం తీసుకోవడం వల్ల కలిగే లాభాలను గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

చింత చిగురులో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. దీంతో ఇది సహజ సిద్ధమైన లాక్సేటివ్గా పనిచేసి విరేచనం సులభంగా అయ్యేలా చేస్తుంది. మలబద్ధకం సమస్య తొలగిపోతుంది. ఫైల్స్ ఉన్న వారికి కూడా చింత చిగురు బాగానే పనిచేస్తుంది..

ఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండడం వల్ల చింత చిగురు చెడు కొలెస్ట్రాల్ను తగ్గించి అదే క్రమంలో మంచి కొలెస్ట్రాల్ను పెంచుతుంది..

వణుకుతూ వచ్చే జ్వరం తగ్గాలంటే చింత చిగురును వాడాలి. ఎందుకంటే ఇందులోని ఔషధ కారకాలు వైరస్ ఇన్ఫెక్షన్లపై పోరాడుతాయి..

చింత చిగురును ఉడికించిన నీటిని పుక్కిలిస్తే గొంతు నొప్పి, మంట, వాపు తగ్గుతాయి. యాంటీ ఇన్ఫ్లామేటరీ గుణాలు చింత చిగురులో ఉన్నాయి..

వేడి వేడి మసాలా పదార్థాలు తినడం వల్ల నోటిలో వచ్చే పగుళ్లు, పూతలను చింత చిగురు తగ్గిస్తుంది..

గుండె జబ్బులు రాకుండా చూస్తుంది. శరీరంలో ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. రక్తాన్ని శుద్ధి చేసే గుణాలు చింత చిగురులో ఉన్నాయి..

కడుపులో నులి పురుగుల సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు చింత చిగురుతో చేసిన వంటలు తినిపిస్తే ఫలితం ఉంటుంది..

జీర్ణాశయ సంబంధ సమస్యలను తొలగించడంలో చింత చిగురు బాగా ఉపయోగపడుతుంది..

చింత చిగురులో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధి గా లభిస్తాయి. ఇందు వల్ల ఇది శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. యాంటీ సెప్టిక్, యాంటీ వైరల్ గుణాలు దీంట్లో ఉన్నాయి..

పలు రకాల క్యాన్సర్లు రాకుండా చూసే ఔషధ గుణాలు చింత చిగురులో ఉన్నాయి..

తరచూ చింత చిగురును తింటే ఎముకలు దృఢత్వాన్ని సంతరించుకుంటాయి..

థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్న వారు చింత చిగురును తమ ఆహారంలో భాగం చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది..

డయాబెటిస్ ఉన్న వారు కూడా చింత చిగురును వాడవచ్చు. ఇది వారి రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది.. ఆల్కహాల్ను ఎక్కువగా సేవించడం వల్ల కలిగే హ్యాంగోవర్ నుంచి ఉపశమనం కలిగేలా చేస్తుంది.. చింత చిగురును పేస్ట్లా చేసి దాన్ని కీళ్లపై ఉంచితే నొప్పులు, వాపులు తగ్గిపోతాయి. ఆర్థరైటిస్ సమస్యతో బాధ పడుతున్న వారికి ఇది మేలు చేస్తుంది.. శరీరంలోని వ్యర్థాలను బయటికి పంపే గుణాలు చింత చిగురులో ఉన్నాయి. ఇది యాస్ట్రింజెంట్లా పనిచేస్తుంది.. నేత్ర సంబంధ సమస్యలను కూడా చింత చిగురు దూరం చేస్తుంది. కళ్లు దురదగా ఉన్నప్పుడు కొంత చింత చిగురు తింటే ఉపశమనం కలుగుతుంది..

ప్రస్తుత పరిస్థితులలో పురుగుమందులు లేకుండా వందకు వందశాతం లభించేది ఇదేనేమో...

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143